తెలుగు దినపత్రిక

# సిరి

People's Voice

వార్త పత్రిక

RNI TG TEL/ 26/A0381

17-04-2026

శుక్రవారం హైదరాబాద్

సంపుటి: (volume): 1

సంచిక: (ISSUE): 78

PUBLISHED FROM HYDERABAD    పేజీలు-8    వెల:రూ.4 /–

## మెదక్ ను జీరో యాక్సిడెంట్ జోన్ తీర్చిదిద్దాలి

- డ్రైవర్ల కంటి చూపు బాగా ఉంటేనే సురక్షిత ప్రయాణం.
- అతివేగం,డ్రంక్ అండ్ డ్రైవ్, ట్రాఫిక్ రూల్స్ పాటించకపోవడం ప్రమాదాలకు సంకేతాలు
- జిల్లా ఎస్పీ డీవి శ్రీనివాసరావు
- వాహనదారులు బాధ్యతగా హెల్మెట్, సీటు బెల్ట్ ధరించాలి.
- ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ల పంపిణీ, సిగ్నేచర్ నిర్వహణ

6





## డీలిమిటేషన్ తో అన్యాయం జరగదు

• అమిత్ షా

3



## మహిళా బిల్లులో రాజకీయం లేదు

30 ఏళ్లుగా మహిళలు ఎదురు చూస్తున్నారు .. వారికి అవకాశం ఇవ్వడం మన బాధ్యత

చట్ట సభల్లోనూ వారు సత్తా చాటేలా చేద్దాం..

3

## సీఎం రేవంత్ మార్క్ సిద్ధం !?

క్యాబినేట్ ప్రక్షాళనకు కసరత్తు

త్వరలో క్యాబినెట్లో మార్పులు చేర్పులు

పలు రాష్ట్రాల ఎన్నికల తర్వాత ముహూర్తం

సీఎం ప్రకటనతో అలెర్ట్ అయిన అమాత్యులు

ఇద్దరు మంత్రులపై వేటు పడనున్నట్లు ప్రచారం

కొత్తగా మంత్రి పీఠం కోసం ఢిల్లీ స్థాయిలో పైరవీలు

కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పంతం నెగ్గేనా ?

ఇప్పటికే తీవ్ర అసంతృప్తితో మునుగోడు ఎమ్మెల్యే

పలుచోట్ల బహిరంగంగా విమర్శలు

పనితీరు బాగాలేని మంత్రుల

శాఖలలోనూ మార్పు తప్పదా?

2



## లోక్‌సభలో మహిళా బిల్లు, డీ లిమిటేషన్ బిల్లులు



- డివిజన్ కోరిన విపక్ష సభ్యులు.. స్పీకర్ అంగీకారం
- సభ ఆమోదంతో బిల్లులు ప్రవేశపెట్టిన మంత్రి అర్జున్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 16, సిరి న్యూస్ :
డీలిమిటేషన్ ద్వారా నియోజకవర్గాలను పెంచేందుకు, పునర్విభజించేందుకు, చట్ట సభల్లో మహిళలకు రిజర్వేషన్ కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం మూడు బిల్లులను గురువారం లోక్‌సభ ముందుకు తీసుకొచ్చింది. ఉదయం 11 గంటలకు లోక్‌సభ ప్రారంభం కాగా కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్, హోంమంత్రి అమిత్ షా వీటిని ప్రతిపాదించారు. వీటిని సభలో ప్రవేశపెట్టేందుకు చర్చ చేపట్టారు. బిల్లులను వ్యతిరేకించిన విపక్షాలు డివిజన్ వోటింగ్‌కు పట్టుబట్టగా స్పీకర్ ఓం బిర్లా సమ్మతించారు. డివిజన్

మిగతా 3వ పేజీలో..

## తెలంగాణ ఏర్పాటుపై బీజేపీ విషం

- తేజస్వి సూర్య, బీజేపీ బేషరతుగా క్షమాపణ చెప్పాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్, ఏప్రిల్ 16, సిరి న్యూస్ : తెలంగాణ ఏర్పాటును దేశ విభజనతో పోల్చుతూ బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య వ్యాఖ్యానించడాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ వ్యతిరేకత బీజేపీ నరనరానా నిండి ఉన్నదంటూ పార్లమెంటు సాక్షిగా

మిగతా 2వ పేజీలో..



## చాక్లెట్ కొనిస్తానని.. యాసిడ్ తాగించింది!

నాలుగేళ్ల బాలుడిపై తోడికోడలి అమానుషం

ఆశచూపి ప్రాణాల మీదకు తెచ్చిన వైనం

తన కొడుకును నిర్లక్ష్యం చేస్తున్నారనే కక్షతో ఘాతుకం

ఆసుపత్రిలో మృత్యువుతో పోరాటం

మేడ్చల్‌మల్కాజిగిరి ఘట్‌కేసర్ పరిధిలో ఘటన

మేడ్చల్, ఏప్రిల్ 16 (సిరి న్యూస్): కుటుంబంలో తలెత్తిన చిన్నపాటి విభేదాలు, అసూయ ఒక పసి ప్రాణాన్ని బలితీసుకునే స్థాయికి చేరాయి. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ పరిధిలో మానవత్వాన్ని మంటగలిపే ఘటన వెలుగుచూసింది. తోడికోడళ్ల మధ్య ఉన్న మనస్పర్థలు చివరకు ఏ పాపం తెలియని నాలుగేళ్ల చిన్నారిపై యాసిడ్

మిగతా 2వ పేజీలో..



3

## సాకారం కాబోతున్న సాధికారత

- మహిళా బిల్లుపై బీజేపీ చీఫ్ రామచందర్‌రావు



## హైదరాబాద్‌లో ప్రోటోల్యాబ్స్ జీసీసీ

- మంత్రి శ్రీధర్‌బాబు

2

## పెట్టుబడులు పెట్టేలా ప్రోత్సహించండి

యూఎస్ నేషనల్ కాలేజ్ వార్' ప్రతినిధుల భేటీలో మంత్రి శ్రీధర్ బాబు

2

## ఢిల్లీలో ముఖ్యమంత్రికి ఘన స్వాగతం

పార్లమెంట్ ఆవరణలో సీఎం రేవంత్ రెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డిని సన్మానించిన మంత్రి సీతక్క

ముఖ్యమంత్రితో మర్యాదపూర్వక భేటీ

రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రంపై ఒత్తిడి తెచ్చే వ్యూహాలపై దిశానిర్దేశం

3





## కౌంటర్ దాఖలు చేయాలి

ఫిరాయింపు ఎమ్మెల్యేల వ్యవహారంపై హైకోర్టు ఆదేశాలు స్పీకర్ సహ 9మందికి నోటీసులు

హైదరాబాద్, సిరి న్యూస్: తెలంగాణలో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హత వ్యవహారం మరోసారి చర్చనీయాంశమైంది. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన 9 మంది ఎమ్మెల్యేలు పార్టీ మారలేదని స్పీకర్ ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై గురువారం హైకోర్టు విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది.

మిగతా 2వ పేజీలో..

## తేజస్వి సభ్యత్వాన్ని రద్దు చేయాలి

- మంత్రి పొన్నం ప్రభాకర్

2





# హైదరాబాద్‌లో ప్రోటోల్యాబ్స్ జీసీసీ

- మంత్రి శ్రీధర్‌బాబు

**హైదరాబాద్, ఏప్రిల్ 16, సిరి న్యూస్:**

అధునాతన ఇంజనీరింగ్, డిజిటల్ తయారీ సంస్థ ప్రోటోల్యాబ్స్ టెక్నాలజీస్ హైదరాబాద్‌లో గ్లోబల్ సామర్థ్య కేంద్రం (జీసీసీ¾) ఏర్పాటుకు ముందుకొచ్చిందని ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. దీని స్థాపనతో 300మంది ప్రతిభావంతులకు ఉద్యోగావకాశాలు దొరుకుతాయన్నారు. అమెరికాలోని మిన్నెసోటా కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహించే ప్రోటోల్యాబ్స్ స్థానిక ఆరోహన్ గ్లోబల్ కన్సల్టింగ్‌తో కలిసి ఈ జీసీసీని నెలకొల్పుతోంది. ప్రోటోల్యాబ్స్ ప్రతినిధి బృందం సచివాలయంలో శ్రీధర్‌బాబుతో గురువారం భేటీ అయింది. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు తమ విస్తరణ కార్యక్రమాలను వివరించారు. జీసీసీ¾ ఏర్పాటుకు హైదరాబాద్‌ను ఎంపిక చేసుకోవడం పట్ల శ్రీధర్ బాబు హర్షం వ్యక్తం చేసారు. 'గత ఏడాది కాలంలో 80 జీసీసీలు ఇక్కడ ఏర్పాటయ్యాయి.. అత్యాధునిక మౌలిక సదుపాయాలు, చక్కని ఎకో సిస్టం ఉండటం వల్ల వాటిని ఆకర్షించగలుగుతున్నాం.. డిఫెన్స్, ఏరోస్పేస్ పరిశ్రమలకు కూడా తెలంగాణ ముఖ్య కేంద్రంగా అభివృద్ధి చెందుతోంది.. నైపుణ్యం ఉన్న ఇంజనీరింగ్ మానవ వనరులు, పటిష్టమైన డిజిటల్ మౌలిక వ్యవస్థ, పరిశ్రమలకు అనుకూలమైన విధానాలు, వేగంగా విస్తరిస్తున్న తయారీ రంగం, హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి జీసీసీలకు అగ్రగామి గమ్యస్థానంగా తీర్చిదిద్దాయి' అని పేర్కొన్నారు. డిజైన్, ఇంజనీరింగ్, ప్రొటోటైపింగ్, తయారీ రంగాల అభివృద్ధికి తమ ప్రభుత్వం అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించిందని తెలిపారు. ఈ కేంద్రం ద్వారా అధునాతన ఇంజనీరింగ్, డిజిటల్ తయారీ సాంకేతికతలు, ఉత్పత్తి అభివృద్ధి రంగాల్లో విస్తృత కార్యకలాపాలు సాగనున్నాయన్నారు. దీంతో హైదరాబాద్ హై వ్యాల్యూ తయారీ రంగంలో మరింత శక్తివంతంగా ఎదుగుతుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రోటోల్యాబ్స్ రాకతో స్థానిక స్టార్టప్‌లు, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థలు (ఎంఎసఎంఈలు), పెద్ద పరిశ్రమలకు ప్రొటోటైపింగ్ తయారీ సదుపాయాలు స్థానికంగా అందుబాటులోకి వస్తాయని తెలిపారు. కొత్త ఉత్పత్తులను మార్కెట్‌లోకి మరింత వేగంగా తీసుకురావడానికి ఇది దోహదపడుతుందని, చైనాపై ఆధారపడే అవసరం తగ్గిపోతుందని చెప్పారు. ప్రోటోల్యాబ్స్ బృందంలో చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ డాన్ షూమాకర్, చీఫ్ హ్యూమన్ రిసోర్సెస్ ఆఫీసర్ అగ్నెస్ సెమింగ్టన్, చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ మార్క్ కెర్మిష్, ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ ఆశిష్ శర్మలు ఉన్నారు. సమావేశంలో ప్రభుత్వ ఐటీ సలహాదారు సాయికృష్ణ కూడా పాల్గొన్నారు.

# తెలంగాణ ఏర్పాటుపై బీజేపీ విషం



**మొదటిపేజీ తరువాయి**

ఆ పార్టీ నాయకులు మరోసారి తమ ద్వేషాన్ని వెళ్లగక్కారని, వారికి తెలంగాణ అస్తిత్వంపై గౌరవం లేదని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్రం ఏర్పడటాన్ని భారత్‌పాకిస్థాన్ విభజనతో పోల్చడం అత్యంత మూర్ఖత్వమని, ఇలాంటి అహంకారపూరిత, తెలంగాణ వ్యతిరేక వ్యాఖ్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని ఆయన అన్నారు. బీజేపీ నాయకులు పదేపదే తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని, అమరవీరుల త్యాగాలను అవమానించడం అలవాటుగా మార్చుకున్నారని మండిపడ్డారు. ప్రధానమంత్రి మోదీ మొదలుకుని ఈరోజు ఎంపీ తేజస్వి సూర్య వరకు ప్రతి ఒక్కరూ తెలంగాణ వ్యతిరేకతను పదేపదే చాటుకుంటున్నారన్నారు. దీనిని తెలంగాణ సమాజం గుర్తుపెట్టుకుంటుందన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఎవరి దయాదాక్షిణ్యాల వల్లనో, ఎవరి భిక్ష వల్లనో ఏర్పడింది కాదని కేటీఆర్ స్పష్టం చేశారు. దశాబ్దాలపాటు సాగిన పోరాటం, వేలాదిమంది యువకుల బలిదానాల ఫలితంగా ఈ గడ్డ విముక్తి పొందిందని గుర్తు చేశారు. అస్తిత్వం కోసం ప్రజలు చేసిన ప్రజాస్వామ్య బద్ధమైన పోరాటాన్ని దేశ విభజన లాంటి విషాదకర సంఘటనలతో పోల్చడం ద్వారా బీజేపీ తన కుసంస్కారాన్ని బయటపెట్టుకుందని విమర్శించారు. రాష్ట్ర ప్రజల మనోభావాలను దెబ్బతీసే హక్కు ఎవరికీ లేదని ఆయన హెచ్చరించారు. పార్లమెంటు సాక్షిగా తోటి ఎంపీ తెలంగాణపై విషం చిమ్ముతున్నా ఎనిమిదిమంది తెలంగాణ బీజేపీ ఎంపీలు మౌనంగా ఉండటం అత్యంత సిగ్గుచేటని కేటీఆర్ దుయ్యబట్టారు. కనీసం kవష్ట్ర నుంచి ఎన్నికైన కాంగ్రెస్ ఎంపీలు సైతం తేజస్వి సూర్య వ్యాఖ్యలను ఖండించకుండా మౌనంగా ఉండడం దారుణమన్నారు. తమ కళ్ల ముందే తెలంగాణను అవమానిస్తున్నా అడ్డుకోలేకపోయిన వీరు ప్రజలకు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమని భావిస్తున్న ఈ ఎంపీల వైఖరిని సమాజం గమనిస్తోందన్నారు. తెలంగాణను కించపరిచిన తేజస్వి సూర్య తక్షణమే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని తెలంగాణ ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని, బీజేపీ కూడా తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. లేకుంటే తేజస్వి సూర్య వ్యాఖ్యలే బీజేపీ¾ అధికారిక విధానంగా భావించాల్సి వస్తుందన్నారు.

# కౌంటర్ దాఖలు చేయాలి

**మొదటిపేజీ తరువాయి**

పార్టీ మారలేదని స్పీకర్ ప్రకటించిన 9 మంది ఎమ్మెల్యేలతో పాటు స్పీకర్ కూడా ఈ వ్యవహారంపై వివరణ ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది. తమ వాదనలతో కూడిన కౌంటర్ అఫిడవిట్‌లను దాఖలు చేయాలని స్పష్టం చేసింది. జాబితాలో దానం నాగేందర్, కడియం శ్రీహరి, పోచారం శ్రీనివాస్ రెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, అరెకపూడి గాంధీ, కాలె యాదయ్య, ప్రకాష్ గౌడ్, గూడెం మహిపాల్ రెడ్డి (సంజయ్), తెల్లం వెంకట్రావు ఉన్నారు.

గతంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఈ ఎమ్మెల్యేలు సాంకేతికంగా పార్టీ మారలేదని, వారు ఇంకా బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నారనే భావన వచ్చేలా స్పీకర్ తీర్పునిచ్చారు. అయితే వారు బహిరంగంగానే కాంగ్రెస్ కండువా కప్పుకున్నారని, ఇది రాజ్యాంగ విరుద్ధమని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హైకోర్టును ఆశ్రయించారు. స్పీకర్ నిర్ణయం ఏకపక్షంగా ఉందని పిటిషనర్లు వాదించారు.

ఈ కేసులో లోతైన విచారణ అవసరమని భావించిన హైకోర్టు తదుపరి విచారణను మే 6కు వాయిదా వేసింది. ఈలోగా ప్రతివాదులందరూ తమ కౌంటర్లను దాఖలు చేయాలని ఆదేశించింది. రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తి రేపుతున్న ఈ కేసులో కోర్టు తీర్పు ఎలా ఉంటుందన్న అంశంపై రాజకీయ వర్గాల్లో చర్చ కొనసాగుతోంది.



# సీఎం రేవంత్ మార్క్ సిద్ధం !?

- క్యాబినేట్ ప్రక్షాళనకు కసరత్తు
- త్వరలో క్యాబినెట్లో మార్పులు చేర్పులు
- పలు రాష్ట్రాల ఎన్నికల తర్వాత ముహూర్తం
- సీఎం ప్రకటనతో అలెర్ట్ అయిన అమాత్యులు
- ఇద్దరు మంత్రులపై వేటు పడనున్నట్లు ప్రచారం
- కొత్తగా మంత్రి పీఠం కోసం ఢిల్లీ స్థాయిలో పైరవీలు
- కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పంతం నెగ్గేనా ?
- ఇప్పటికే తీవ్ర అసంతృప్తితో మునుగోడు ఎమ్మెల్యే
- పలుచోట్ల బహిరంగంగా విమర్శలు
- పనితీరు బాగాలేని మంత్రుల శాఖలలోనూ మార్పు తప్పదా?

**(ప్రత్యేక ప్రతినిధి - సిరిన్యూస్):**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన మంత్రివర్గ ప్రక్షాళనకు ముహూర్తం ఖరారు చేసినట్లు తెలుస్తోంది. వివిధ రాష్ట్రాల్లో జరుగుతున్న ఎన్నికల తర్వాత రాష్ట్ర క్యాబినెట్ విస్తరణ ఉంటుందని ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా ప్రకటించిన నేపథ్యంలో అటు మంత్రుల్లో, ఇటు ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది. ప్రస్తుతం వివిధ రాష్ట్రాల ఎన్నికల హడావుడి ముగిసిన వెంటనే సీఎం ఢిల్లీ పర్యటనకు వెళ్లి ఏఐసీసీ పెద్దలతో చర్చించి గ్రీన్ సిగ్నల్ తెచ్చుకోనున్నట్లు సమాచారం. ఈ విస్తరణలో కేవలం ఖాళీగా ఉన్న రెండు పదవులను భర్తీ చేయడమే కాకుండా, పనితీరు సరిగ్గా లేని మంత్రులను సాగనంపేందుకు కూడా ముఖ్యమంత్రి గట్టి నిర్ణయంతో ఉన్నట్లు తెలుస్తోంది.

**ఆ ఇద్దరు మంత్రులకు ఉద్వాసన తప్పదా ?**

ముఖ్యంగా ఇద్దరు మంత్రులపై ఈసారి వేటు పడటం ఖాయమని రాజకీయ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. ఉత్తర, దక్షిణ తెలంగాణకు చెందిన ఈ ఇద్దరు మంత్రుల తీరు గత కొంతకాలంగా ప్రభుత్వానికి మైనస్‌గా మారిందనే విమర్శలు ఉన్నాయి. తమ నియోజకవర్గాల్లో వర్గ రాజకీయాలను ప్రోత్సహించడం, ప్రభుత్వంపైనే అనుచిత వ్యాఖ్యలు చేయడం, సొంత నిర్ణయాలను ప్రకటించడం, అధికారులతో బాధ్యతారాహిత్యంగా ప్రవర్తించడం వంటి వాటిపై ఇప్పటికే అధిష్టానం దృష్టి సారించింది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల్లోకి వెళ్లకుండా, కేవలం తమ వ్యక్తిగత అజెండాలకే ప్రాధాన్యత ఇస్తున్నారనే నివేదికల ఆధారంగా వీరిని తొలగించేందుకు రేవంత్ రెడ్డి మొగ్గు చూపుతున్నట్లు విశ్వసనీయ సమాచారం.

**కొత్తగా పీఠమెక్కే వారెవరో..?**

రాష్ట్ర మంత్రివర్గంలో ఖాళీగా ఉన్న రెండు స్థానాలకు పోటీ బాగానే ఉంది. ఈ జాబితాలో మొదటి రేసులో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. మరోవైపు సీనియారిటీ కోటాలో పి.సుదర్శన్ రెడ్డి, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి మల్ రెడ్డి రంగారెడ్డి తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, లంబాడ సామాజిక వర్గం నుంచి బాలు నాయక్, రామచంద్ర నాయక్ పేరు కూడా వినిపిస్తోంది. మంచిర్యాల నుంచి ప్రేమ్ సాగర్ రావు సైతం మంత్రి పదవి కావాలని కోరుతున్నారు. విజయశాంతి, మధుయాష్కీ గౌడ్ వంటి నేతలు కూడా తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు.



**రాజగోపాల్ రెడ్డి పంతం నెగ్గించుకునేనా?**

కాంగ్రెస్ పార్టీలో చేరే సమయంలోనే తనకు మంత్రి పదవి ఇస్తామని అధిష్టానం హామీ ఇచ్చిందని రాజగోపాల్ రెడ్డి బహిరంగంగానే చెబుతున్నారు. పార్టీ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు కావస్తున్నా తనకు ఇంకా అవకాశం రాకపోవడంపై ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఒక సందర్భంలో 'మంత్రిని అవుతాను.. లేదంటే డైరెక్ట్ సీఎంనే అవుతాను' అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా పెద్ద దుమారాన్నే రేపాయి. అంతేకాదు.. పదేపదే వీలు దొరికినప్పుడల్లా ఆయన తన అసంతృప్తిని వెళ్లగక్కుతూనే ఉన్నారు. కాగా రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి దక్కకపోవడానికి ప్రధాన కారణం సామాజిక, ప్రాంతీయ సమీకరణాలు కారణాలని తెలుస్తోంది. ఇప్పటికే ఆయన అన్న కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మంత్రివర్గంలో ఉన్నారు. ఒకే కుటుంబం నుంచి ఇద్దరికి, అలాగే ఉమ్మడి నల్గొండ జిల్లా నుంచి ఇప్పటికే ఉత్తమ్ కుమార్ రెడ్డి, వెంకట్ రెడ్డి వంటి సీనియర్లు ఉండటంతో మూడో వ్యక్తిగా రాజగోపాల్ రెడ్డిని తీసుకోవడం అధిష్టానానికి కొంత ఇబ్బందిగా మారింది. అయితే ఇటీవల టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సైతం రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఇస్తే తప్పేంటనే వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. ఇద్దరు సోదరులు మంత్రివర్గంలో ఉంటే బాగుంటుందన్న అభిప్రాయాన్ని జగ్గారెడ్డి వ్యక్తం చేయడం వెనుక రాజగోపాల్‌రెడ్డి తంత్రం పనిచేస్తుందా అనే సందేహాలు కలుగుతున్నాయి. అయితే రెడ్డి సామాజిక వర్గం కోటా ఇప్పటికే నిండిపోవడం కూడా ఆయనకు ప్రతిబంధకంగా మారింది. ఏది ఏమైనా ఈసారి రాజగోపాల్ రెడ్డి కల నెరవేరుతుందా? లేక ఆయన తిరుగుబాటు అస్త్రం ప్రదర్శిస్తారో చూడాలి

**పలువురి శాఖల మార్పుపై దృష్టి...**

అటు పదవులు దక్కించుకున్నా, తమ శాఖలపై పట్టు సాధించలేక వెనుకబడి ఉన్న మంత్రులకు కూడా ముఖ్యమంత్రి షాక్ ఇవ్వబోతున్నారు. కీలకమైన ఫైళ్లను పరిష్కరించడంలో జాప్యం చేస్తూ, పాలన వేగాన్ని అందుకోలేని వారి శాఖలను మార్చాలని నిర్ణయించారు. దీంతో తమ పదవులకు ఎక్కడ ఎసరు వస్తుందో..? లేక ప్రాధన్యత లేని శాఖ ఎక్కడ కట్టబెడతారోనని మంత్రులు మల్లగుల్లాలు పడుతున్నారు.. కాగా, ఇదే విషయమై తమ అనుచరులతో అత్యంత గోప్యంగా సమాచారం తెప్పించుకుంటున్నట్లు కూడా చర్చ జరుగుతోంది.

## చాక్లెట్ కొనిస్తానని..
# యాసిడ్ తాగించింది!

**మొదటిపేజీ తరువాయి**

దాడికి దారితీశాయి. తన కొడుకును ఇంట్లో నిర్లక్ష్యం చేస్తున్నారనే కక్షతో, తోడికోడలి బిడ్డను అంతం చేయాలనుకున్న ఆ మహిళ క్రూరత్వం స్థానికంగా పెను కలకలం రేపింది.

**జ్యూస్ తాపించి.. చాక్లెట్ ఇస్తానని నమ్మించి..**

పోలీసుల కథనం ప్రకారం.. నిందితురాలు తన తోడికోడలి నాలుగేళ్ల కుమారుడిని లక్ష్యంగా చేసుకుంది. బాలుడికి ఇష్టమైన చాక్లెట్ ఇస్తానని ఆశ చూపించి మభ్యపెట్టింది. 'ఈ జ్యూస్ తాగితే నీకు పెద్ద చాక్లెట్ కొనిస్తాను' అంటూ నమ్మబలికి, గ్లాసులో యాసిడ్ కలిపి తాగించింది. ఏమీ తెలియని ఆ చిన్నారి జ్యూస్ అనుకుని అది తాగడమే ఆలస్యం.. కొద్దిసేపటికే తీవ్ర అస్వస్థతకు గురై విలవిలలాడిపోయాడు. గొంతు, కడుపులో మంటతో చిన్నారి పెట్టిన కేకలు విని తల్లిదండ్రులు పరుగున వచ్చారు.

**ఆసుపత్రిలో మృత్యువుతో పోరాటం**

బాలుడి పరిస్థితి విషమంగా ఉండటాన్ని గమనించిన తల్లిదండ్రులు వెంటనే స్పందించి, సమీపంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. యాసిడ్ ప్రభావం వల్ల బాలుడి అంతర్గత అవయవాలు దెబ్బతినే ప్రమాదం ఉండటంతో, వైద్యులు అత్యవసర చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం చిన్నారి పరిస్థితి నిలకడగా ఉన్నప్పటికీ, వైద్యులు ప్రత్యేక పర్యవేక్షణలో ఉంచి చికిత్స కొనసాగిస్తున్నారు. ఆ పసివాడు పడుతున్న నరకం చూసి ఆసుపత్రి సిబ్బంది సైతం కన్నీరు పెట్టుకుంటున్నారు.



**అసూయే అసలు కారణమా?**

ప్రాథమిక సమాచారం ప్రకారం.. నిందితురాలికి, ఆమె తోడికోడలికి మధ్య గత కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఇంట్లో తన కొడుకు కంటే, తోడికోడలి కొడుకుకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని, అందరూ అతడినే గారబం చేస్తున్నారని నిందితురాలు మనస్తాపానికి గురైంది. ఆ అసూయ కాస్తా ద్వేషంగా మారి, చివరకు ఆ చిన్నారిని లేకుండా చేయాలనే దారుణమైన ఆలోచనకు దారితీసింది. పగ ప్రతీకారాలతో రగిలిపోయిన ఆమె, కన్నబిడ్డ అన్న విచక్షణ కూడా మరచి ఈ ఘాతుకానికి ఒడిగట్టింది.

**కేసు నమోదు చేసిన పోలీసులు**

ఈ ఘటనపై బాధితుడి తల్లి మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చిన్నారిపై జరిగిన అమానుషాన్ని వివరిస్తూ కన్నీరుమున్నీరయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితురాలిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. కుటుంబ సభ్యుల మధ్య ఉన్న చిన్నపాటి మనస్పర్థలు ఇంతటి దారుణానికి దారితీయడం పట్ల పోలీసులు సైతం విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

**స్థానికంగా కలకలం**

ఒకే ఇంట్లో ఉంటూ, సొంత రక్తసంబంధీకుల పిల్లలపైనే ఇలాంటి దాడులకు పాల్పడటం స్థానిక ప్రజలను భయాందోళనలకు గురిచేస్తోంది. కళ్లముందే తిరిగే పసివాడిపై ఇంత కక్ష పెంచుకోవాలా? అంటూ స్థానికులు సదరు మహిళ తీరుపై మండిపడుతున్నారు. ప్రస్తుతం ఈ ఘటన మేడ్చల్ జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది.



# తేజస్వి సభ్యత్వాన్ని రద్దు చేయాలి

**హైదరాబాద్, ఏప్రిల్ 16, సిరి న్యూస్ :**

పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో డీలిమిటేషన్‌పై బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలకు రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ కౌంటర్ ఇచ్చారు. తేజస్వి వ్యాఖ్యలు ప్రజాస్వామ్యానికే విఘాతం కలిగించేలా ఉన్నాయని, వాటిని లోక్‌సభ రికార్డుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. అలాగే తేజస్వి లోక్‌సభ సభ్యత్వాన్ని కూడా రద్దు చేయాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. 'తెలంగాణ డీఎన్ఏ ఉన్న ఎవరైనా తేజస్వి వ్యాఖ్యలను ఖండించాలన్నారు. ఈ విషయమై తెలంగాణ బీజేపీ ఎంపీలు ఎందుకు స్పందించడం లేదన్నారు. తేజస్వి సూర్య ఓ తెలివి లేని వ్యక్తి అంటూ విమర్శలు గుప్పించారు. తెలంగాణ ఏర్పాటుపై ఇంత అజ్ఞానంగా మాట్లాడతారా.. రాజ్యాంగ బద్ధంగా ఏర్పాటైన రాష్ట్రాన్నే అవమానిస్తారా అంటూ ఆక్షేపించారు. తేజస్వి రాజ్యాంగాన్ని కించపరిచేలా మాట్లాడారన్నారు.

# పెట్టుబడులు పెట్టేలా ప్రోత్సహించండి

- ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాల్లో రాష్ట్రం అవకాశాల ఖని
- యూఎస్ నేషనల్ కాలేజ్ వార్' ప్రతినిధుల భేటీలో మంత్రి శ్రీధర్ బాబు

**హైదరాబాద్, ఏప్రిల్ 16, సిరి న్యూస్ :**

ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాల్లో దేశంలోనే అగ్రగామిగా దూసుకెళ్తున్న తెలంగాణలో పెట్టుబడులు పెట్టేలా అమెరికా పారిశ్రామికవేత్తల్ని ప్రోత్సహించాలని ఆ దేశ ఉన్నతస్థాయి ప్రతినిధి బృందాన్ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో యూఎస్ నేషనల్ కాలేజ్ వార్ బృంద సభ్యులతో ఆయన గురువారం ప్రత్యేకంగా భేటీ అయ్యారు. డ్రోన్లు, కౌంటర్ డ్రోన్ సిస్టమ్స్, ఏరోస్పేస్ కాంపోనెంట్స్, డిఫెన్స్ ఎలక్ట్రానిక్స్, సైబర్ సెక్యూరిటీ, స్పేస్ టెక్నాలజీ, ఏఐ ఇన్ డిఫెన్స్, శాటిలైట్స్ సిస్టమ్స్ అండ్ అడ్వాన్స్‌డ్ కమ్యూనికేషన్స్‌లో రాష్ట్రాన్ని గ్లోబల్ లీడర్‌గా తీర్చిదిద్దేలా తమ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందన్నారు. రాకెట్ల తయారీ నుంచి అత్యాధునిక డ్రోన్ల వరకు, యుద్ధ విమానాల విడిభాగాల నుంచి శాటిలైట్ల వరకు అన్నింటిలోనూ 'మేడిన్ తెలంగాణ' మార్క్ ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా కనిపిస్తోందన్నారు. ఈ రంగం (ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్)లో తెలంగాణ ఏటా 30 శాతానికి పైగా వృద్ధిని రేటును నమోదు చేస్తోందన్నారు. అలాగే 202426 మధ్య కాలంలో ఎగుమతుల్లో 103 శాతం కాంపౌండ్ యాన్యువల్ గ్రోత్ రేట్ (సీఏజీఆర్) నమోదయిందన్నారు. లాక్హీడ్ మార్టిన్, బోయింగ్, సాఫ్రాన్, ఎయిర్ బస్, డస్సాల్ట్ ఏవియేషన్ తదితర ప్రపంచ దిగ్గజ ఏరోస్పేస్ కంపెనీలతో డీఆర్డీవో, భెల్, మిధాని, బీడీఎల్, ఆర్‌సీఐ, హాల్ తదితర కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలు ఇక్కడ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయన్నారు. ఇవేకాక ప్రిసిషన్ ఇంజనీరింగ్, డ్రోన్లు, డిఫెన్స్ ఎలక్ట్రానిక్స్ రంగాల్లో 1,500 కంటే ఎక్కువ ఎంఎస్ఎంఈలు తెలంగాణ బ్రాండ్‌ను విశ్వవ్యాప్తం చేస్తున్నాయన్నారు. ప్రపంచంలోనే అత్యంత 'కాస్ట్ ఎఫెక్టివ్ ఏరోస్పేస్ సిటీ'గా హైదరాబాద్ మొదటి స్థానంలో నిలిచిందన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వరుసగా ఐదుసార్లు 'బెస్ట్ స్టేట్ ఫర్ ఏరోస్పేస' అవార్డును గెలుచుకుని గ్లోబల్ ఏరోస్పేస్ మ్యాప్‌లో తెలంగాణ ఒక శక్తిమంతమైన కేంద్రంగా మారిందన్నారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ఏరో స్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాలకు అవసరమైన ఎకో సిస్టంను అభివృద్ధి చేస్తున్నామన్నారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ద్వారా ఈ రంగానికి అవసరమైన రెడీ టూ స్కిల్ వర్క్ ఫోర్స్‌ను అందిస్తున్నామన్నారు. పెట్టుబడులకు మాత్రమే కాదు, సాంకేతికత, పరిశోధన, తయారీ, నైపుణ్యాభివృద్ధిలో అమెరికాకు నమ్మకమైన దీర్ఘకాల వ్యూహాత్మక భాగస్వామిగా నిలిచేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. ఏఐ, సైబర్ సెక్యూరిటీ, అడ్వాన్స్‌డ్ మాన్యుఫ్యాక్చరింగ్, స్పేస్ టెక్నాలజీ తదితర రంగాల్లో అమెరికా సంస్థలు, విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలతో కలిసి పని చేస్తామన్నారు. తెలంగాణ లాంటి ప్రగతిశీల రాష్ట్రాలతో కలిసి పని చేసేందుకు సిద్ధంగా ఉన్నామని, రాబోయే రోజుల్లో ఆ దిశగా అడుగులు వేస్తామని స్టేట్ డిపార్ట్‌మెంట్ మినిస్టర్ కౌన్సిలర్ పాల్ నరైన్ పేర్కొన్నారు. అమెరికాతెలంగాణ మధ్య ద్వైపాక్షిక సహకారాన్ని పెంపొందించేందుకు చొరవ చూపుతామన్నారు. కార్యక్రమంలో కెప్టెన్ ఫ్రాంక్ ఒకటా(నేవీ), రెనో బామ్‌ఫోర్డ్(డిఫెన్స్ సెక్యూరిటీ కోఆపరేషన్ ఏజెన్సీ), లెఫ్టినెంట్ కల్నల్ జాన్ కయాంగ్యాంగ్(ఆర్మీ), రెబెక్కా కింగ్(డిఫెన్స్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ), లెఫ్టినెంట్ కల్నల్ మైఖేల్ కూబ్(ఎయిర్ నేషనల్ గార్డ్), జోస్ సలాస్(డిఫెన్స్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ ఏజెన్సీ), టీజీఐఐసీ ఎండీ శశాంక, పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి, ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ డైరెక్టర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



# సాకారం కాబోతున్న సాధికారత

- **మహిళా బిల్లుపై బీజేపీ చీఫ్ రామచందర్‌రావు**



**హైదరాబాద్, ఏప్రిల్ 16, సిరి న్యూస్:**

మహిళల రాజకీయ ను మరింత బలపరిచేందుకు వారికి 2029 నుంచి చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలనే దృఢ సంకల్పంతో చట్ట సవరణను కేంద్రం పార్లమెంటులో ప్రవేశపెట్టిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు తెలిపారు. చందానగర్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ దీంతోపాటు డీలిమిటేషన్ ప్రక్రియను కూడా ముందుకు తీసుకొస్తున్నామన్నారు. ఎన్నో ఏళ్లుగా మహిళలు కలగంటున్న సమాన ప్రాతినిధ్యం ఈ చట్టంతో సాకారం కాబోతోందన్నారు. ఈ చారిత్రక నిర్ణయం సందర్భంగా మహిళల తరఫున, ప్రజల తరఫున ప్రధాని మోదీకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని, రాష్ట్రంలోని మహిళలందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని అన్నారు. 2008లో మహిళా రిజర్వేషన్ బిల్లును కాంగ్రెస్ పార్టీ తీసుకురావడానికి ప్రయత్నించగా ఆ సమయంలో తన మిత్రపక్షాలైన జనతాదళ్, ఆర్జేడీ, సమాజ్‌వాదీ పార్టీలు పార్లమెంటులో బిల్లు ప్రతులను చింపివేసి ఈ చట్టాన్ని అడ్డుకున్నాయని తెలిపారు. అప్పటి కాంగ్రెస్ నాయకత్వం, ముఖ్యంగా సోనియా గాంధీ స్పష్టమైన వైఖరిని వ్యక్తం చేయలేదని విమర్శించారు. అంతకుముందు రాజీవ్ గాంధీ మహిళా రిజర్వేషన్లు తీసుకొస్తామని హామీ ఇచ్చినా అమలు కాలేదన్నారు. ఈరోజు కాంగ్రెస్ నాయకుల ప్రవర్తనను గమనిస్తే వారు మహిళలకు 33 శాతం రిజర్వేషన్లకు వ్యతిరేకంగా ఉన్నట్టు స్పష్టంగా కనిపిస్తోందని ఆయన విమర్శించారు. కొత్తకొత్త ప్రతిపాదనలతో ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తూ మహిళా రిజర్వేషన్ల అమలును అడ్డుకోవాలనే ఉద్దేశంతో కాంగ్రెస్, ఇండీ అలయెన్స్ పార్టీలు వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోనే ఈ చట్టం సాధ్యమైందని, 2029 నుంచి ఇది అమల్లోకి వస్తే దేశ రాజకీయాల్లో మహిళల పాత్రను విస్తృతంగా పెంచుతుందని చెప్పారు. దేశ జనాభా 140 కోట్లకు చేరిన నేపథ్యంలో సీట్ల సంఖ్యను కూడా సుమారు 50 శాతం మేరకు పెంచే అవకాశం డీలిమిటేషన్ బిల్లు కల్పిస్తోందన్నారు. అందులో 33 శాతం మహిళలకు రిజర్వేషన్ కల్పించడం ద్వారా సరైన ప్రాతినిధ్యం సాధ్యం అవుతుందన్నారు. ఈ చట్టం వల్ల ఏ రాష్ట్రానికో, ఏ ప్రాంతానికో నష్టం జరుగుతుందనే ప్రచారం తప్పు అంటూ కాంగ్రెస్ దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని రామచందర్‌రావు విజ్ఞప్తి చేశారు.

# మహిళా బిల్లులో రాజకీయం లేదు

- **30 ఏళ్లుగా మహిళలు ఎదురు చూస్తున్నారు**
- **వారికి అవకాశం ఇవ్వడం మన బాధ్యత**
- **చట్ట సభల్లోనూ వారు సత్తా చాటేలా చేద్దాం**
- **మహిళా బిల్లుపై పార్లమెంటులో ప్రధాని మోదీ ప్రసంగం**

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 16, సిరి న్యూస్:**

మహిళా రిజర్వేషన్ బిల్లును రాజకీయ కోణంలో చూడవద్దని, ఈ బిల్లు ఏ పార్టీకీ అనుకూలం కాదని ప్రధాని మోదీ అన్నారు. దానికి రాజకీయ రంగు పూయవద్దన్నారు. ఎవరు బాధ్యులైనా ఇప్పటికే మహిళా రిజర్వేషన్ బిల్లును ఆలస్యం చేశామన్నారు. మహిళా బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టిన సందర్భంగా మోదీ ప్రసంగించారు. ఈ బిల్లులను తీసుకొచ్చిన సక్సెస్ ట్రెజరీ బెంచ్‌లకు కానీ, మోదీకి కానీ దక్కదని, ఇది భారత ప్రజాస్వామ్యానికి దక్కుతుందని అన్నారు. 131వ రాజ్యాంగ సవరణ బిల్లుపై ప్రధాని మోదీ మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్ బిల్లు అంశంలో క్రెడిట్ ఎవరిదన్న దానిపై ఆలోచించరాదన్నారు. కావాలంటే మీరు క్రెడిట్ తీసుకోవచ్చునని ప్రతిపక్షాలకు చెప్పారు. ముందుగా 33 శాతం మంది మహిళలు ఇక్కడకు రావాలన్నారు. భారతీయ సోదరీమణులను నమ్మండి అని, వారి ఇంటెలిజెన్స్‌ను గుర్తించాలని అన్నారు. నారీ శక్తి వికసిత్ భారత్‌కు ఉపయోపడుతుందన్నారు. మనం తీసుకోబోయే నిర్ణయాన్ని మహిళలు వీక్షిస్తున్నారని, మన ఉద్దేశాలను కూడా గమనిస్తున్నారని అన్నారు. మహిళా రిజర్వేషన్ పక్రియను మరింత ఆలస్యం చేయవద్దని కోరారు. రాజ్యాంగ సవరణ బిల్లులతో ఏ రాష్ట్రానికీ అన్యాయం జరగదని, ఎవర్నీ వివక్షపూరితంగా చూడబోమని అన్నారు. అలాగే దక్షిణాదికి అన్యాయం అంటున్న వాదనలో కూడా వాస్తవం లేదన్నారు. ఒకవేళ బిల్లు పాసైన తర్వాత ఎవరైనా క్రెడిట్ కావాలంటే వారి పేరు, ఫోటోతో ఫుల్ పేజీ యాడ్ ఇవ్వనున్నట్లు చెప్పారు. మహిళా రిజర్వేషన్ బిల్లును అందరి అచీవ్‌మెంట్‌గా చూడాలన్నారు. కానీ ఒకవేళ మూడు దశాబ్దాల తర్వాత కూడా ఈ సంస్కరణ చేపట్టకపోతే అప్పుడు ఆ లబ్ది ఏ పార్టీకీ దక్కదని పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును వ్యతిరేకించే వారు భవిష్యత్తులో భారీ మూల్యం చెల్లించుకుంటారన్నారు. డీలిమిటేషన్ అంశంలో గ్యారెంటీ ఇవ్వనున్నట్లు ప్రధాని తెలిపారు. గ్యారెంటీ, ప్రామిస్ పదాలు వాడమంటే వాడతానని, ఒకవేళ తమిళంలో దీనికి తగిన పదం ఏదైనా ఉందంటే దాన్ని కూడా చెబుతానని, మన ఉద్దేశం స్వచ్ఛమైనదైతే అప్పుడు పదాలతో ఆడాల్సిన అవసరం ఉండదని అన్నారు. దేశ చరిత్రలో ఇదో కీలక ఘట్టమని మోదీ వ్యాఖ్యానించారు. కాలానుగుణంగా మనం కూడా మారాలన్నారు. వాస్తవానికి ఈ బిల్లును 30 ఏళ్ల క్రితమే ఆమోదించాల్సిందని చెప్పుకొచ్చిన ఆయన ఇది దేశ చరిత్రలోనే గొప్ప బిల్లు అని అభిప్రాయపడ్డారు. ఈ బిల్లును ఆమోదించడం ప్రస్తుత పార్లమెంటుకు ఓ సువర్ణావకాశమని అన్నారు. 'దేశానికి సరికొత్త దిశను సూచించే ప్రయత్నం చేస్తున్నాం. దేశంలోని సగం జనాభాకు అధికారం ఇవ్వడం అద్భుత ఘట్టం.. వికసిత్ భారత్ అంటే మౌలిక వసతుల కల్పనే కాదు.. మహిళలకు అధికారం ఇవ్వడం కూడా.. వికసిత్ భారత్‌లో మహిళల భాగస్వామ్యమే లక్ష్యం.. మహిళలకు అధికారమిస్తే దేశానికి సరికొత్త మార్గం చూపిస్తారు.. మహిళలకు నిర్ణయాధికారం ఇవ్వడమే తమ లక్ష్యం.. ఇందులో ఎలాంటి రాజకీయ ప్రయోజనాలు లేవు.. ఈ విషయంలో విపక్షాలను మహిళలు ఎప్పటికీ క్షమించరు' అని ప్రధాని వ్యాఖ్యానించారు. పంచాయతీల్లో రిజర్వేషన్లకు అందరూ అంగీకరించారు. లోక్‌సభలో మాత్రం బిల్లును అడ్డుకుంటున్నారు. ఈ బిల్లుకు మద్దతిచ్చే పార్టీలకే మనుగడ ఉంటుంది. 30 ఏళ్లలో ఇదే అంశం రుజువైంది. మహిళల్లో రాజకీయ చైతన్యం పెరిగింది. అత్యున్నత చట్ట సభల్లోనూ భాగస్వామ్యం కోరుతున్నారు. చీపురు పనికాదు.. పార్లమెంట్‌లో సీట్లు అడుగుతున్నారు. ఇప్పుడు బిల్లును వ్యతిరేకించిన వారిని మహిళలే శిక్షిస్తారు' అని మోదీ పేర్కొన్నారు. ప్రస్తుతానికి 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయనివ్వండి.. ఆ తర్వాత ఓబీసీ, ఇతర వర్గాల కోటాపై ఆలోచిద్దామని మోదీ చెప్పారు. 'పార్లమెంట్‌పై నాకు నమ్మకం ఉంది. అత్యంత వెనుకబడిన వర్గానికి చెందిన నాకు ప్రధాని పదవి దక్కింది.. తప్పకుండా ఓబీసీలకు న్యాయం చేస్తాం.. మహిళా రిజర్వేషన్‌కు రాజకీయ రంగు పులమొద్దు.. ఈ బిల్లు పార్టీల కోసం కాదు.. మహిళల కోసమే అంటూ రిజర్వేషన్లు మహిళల హక్కు.. 2029లో రిజర్వేషన్లు అమలు చేయకపోతే మహిళలకు అన్యాయం జరిగినట్టవుతుంది.. వికసిత్ భారత్ సాధనలో మహిళలదే కీలక పాత్ర.. ఇప్పటికైనా మహిళా రిజర్వేషన్ ఆలస్యం కాకూడదు.. దీనికి అన్ని పార్టీలు మద్దతు ఇవ్వాలి' అని ప్రధాని పిలుపునిచ్చారు. దేశమంతా ఒక్కటే.. ప్రాంతీయ భేదాలు ఉండకూడదు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు అన్ని ప్రాంతాలూ సమానమే. ఉత్తర భారతం, దక్షిణ భారతం అనే తేడా తమకు లేదు అని అన్నారు. చిన్న రాష్ట్రాలకు ఎలాంటి అన్యాయం జరగదని, దేశాన్ని ముక్కలు చేసే అధికారం మనకు లేదని స్పష్టం చేశారు. అన్ని పార్టీలకు ధన్యవాదాలు తెలుపుతూ శుక్రవారం ప్రకటన చేస్తా.. నా స్వార్థం కోసం బిల్లు అంటూ తప్పుడు ప్రచారం చేయవద్దు అని మోదీ తన ప్రసంగంలో వివరించారు. ఈ బిల్లులతో దేశానికి సరికొత్త దశ, దిశను ఇస్తున్నాం. వికసిత్ భారత్ అంటే రోడ్లు, రైళ్లు, మౌలిక సదుపాయాలు మాత్రమే కాదు.. మహిళల స్వావలంబన కూడా ఉంటేనే అది సంపూర్ణ వికసిత్ భారత్ అవుతుంది అని చెప్పారు. రాజకీయాల్లో తమ శక్తిని చాటేందుకు మహిళలు సిద్ధంగా ఉన్నారు. ఎవరికైనా అవకాశమిస్తేనే కదా వారి సామర్థ్యం తెలిసేది అని అన్నారు. రాజకీయాల్లో సామర్థ్యం, అనుభవం ఉన్న మహిళలు పుష్కలంగా ఉన్నారు.. దేశ ప్రగతిలో మహిళలకూ భాగస్వామ్యం కల్పించాల్సిందేనన్నారు. చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు.. మహిళలకు మనం ఇస్తున్న కానుక కాదు. అది వారి హక్కు అని మోదీ వ్యాఖ్యానించారు. 2024 ఎన్నికల్లో వీటిని అమలు చేద్దామని తాము ప్రయత్నించినా సాధ్యం కాలేదన్నారు. 2029 ఎన్నికల్లోనూ రిజర్వేషన్లు ఇవ్వకపోతే మహిళలకు అన్యాయం చేసినట్లేనన్నారు.

# లోక్‌సభలో మహిళా బిల్లు, డీ లిమిటేషన్ బిల్లులు

**మొదటిపేజీ తరువాయి**



ఓటింగ్ నిర్వహించగా బిల్లును ప్రవేశపెట్టేందుకు మద్దతుగా 251, వ్యతిరేకంగా 185 మంది ఓటు చేశారు. మెజారిటీ సాధించిన అనంతరం మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఈ బిల్లులను లోక్‌సభలో ప్రవేశపెట్టారు. డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటు చేసే బిల్లు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో నియోజకవర్గాల పునర్విభజనకు అవకాశం కల్పించే బిల్లులను ఒకేసారి పరిశీలించి, ఆమోదించేలా లోక్‌సభ నిబంధన 66లోని ప్రొవైజోను సస్పెండు చేసి అనుమతించాలని కోరుతూ కేంద్ర మంత్రి మేఘ్వాల్ తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ బిల్లులు రాజ్యాంగ సవరణ బిల్లుతో ముడిపడి ఉన్నందున అనుమతించాలని అందులో కోరారు. చర్చకు స్పీకర్ ఓం బిర్లా అనుమతించారు. శుక్రవారం సాయంత్రం 4 గంటలకు వీటిపై ఓటింగ్ నిర్వహించనున్నట్లు సభాపతి తెలిపారు. ఈ మూడింటిలో లోక్‌సభ సీట్లను 550 నుంచి గరిష్ఠంగా 850కి పెంచడంతోపాటు 2011 జనాభా లెక్కల ప్రకారమే దేశంలో డీ లిమిటేషన్ పక్రియ చేపట్టే 131వ రాజ్యాంగ సవరణ బిల్లు, లోక్‌సభ అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజనకు అవసరమైన డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటుకు సంబంధించిన మరో బిల్లు ఉన్నాయి. వీటిని మంత్రి అర్జున్‌రామ్ మేఘtTవాల్ ప్రవేశపెట్టారు. కేంద్ర పాలిత ప్రాంతాల్లో నియోజకవర్గాల పునర్విభజనకు అవకాశం కల్పించే ఇంకో బిల్లును హోంమంత్రి అమిత్ షా సభ ముందుంచారు. వీటిపై సుదీర్ఘంగా చర్చించనున్నారు. రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందాలంటే మూడింట రెండొంతుల మెజారిటీ కావాలి. మిగతా రెండింటికీ సాధారణ మెజారిటీ సరిపోతుంది. ప్రస్తుతం లోక్‌సభలో ఉన్న 540 మంది సభ్యుల్లో 2/3వ వంతు మెజారిటీ అంటే 360 మంది సభ్యుల మద్దతు అవసరం. అధికారిక ఎన్డీయే కూటమికి 292 మంది సభ్యుల మద్దతు ఉంది. బిల్లు ఆమోదానికి మరో 68మంది మద్దతు అవసరం. డీలిమిటేషన్‌ను వ్యతిరేకిస్తున్నామని చెబుతున్న ఇండి కూటమి ఆ బిల్లుకు వ్యతిరేకంగా ఓటేస్తామని చెప్పడంతో రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదంపై ఉత్కంఠ నెలకొంది.

**2024లోనే ఎందుకు అమలు చేయలేదు : కాంగ్రెస్ నేత వేణుగోపాల్ అభ్యంతరం**

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు బిల్లులపై విపక్షాలు తమ అభ్యంతరాలను లేవనెత్తగా వాటిని కేంద్ర హోంమంత్రి అమిత్ షా తోసిపుచ్చారు. 2024లో మహిళా రిజర్వేన్లను ఎందుకు అమలు చేయలేదని లోక్‌సభలో బిల్లులు ప్రవేశపెట్టడానికి ముందు జరిగిన చర్చ సందర్భంగా కాంగ్రెస్ నేత కేసీ వేణుగోపాల్ ప్రశ్నించారు. 2023లోనే ఆ బిల్లుకు సంపూర్ణ మద్దతు ఇచ్చామన్నారు. రాజ్యాంగాన్ని ప్రభుత్వం హైజాక్ చేస్తోందన్నారు. దీనిపై అమిత్‌షా స్పందిస్తూ బిల్లు ప్రవేశపెట్టకుండానే ఎలా ప్రశ్నిస్తారని అసహనం వ్యక్తం చేశారు. బిల్లు సభలో ప్రవేశపెట్టిన తర్వాత సభ్యులు తమ అభిప్రాయాలు చెప్పవచ్చన్నారు. ప్రజల్లో ఆందోళన కలిగించేలా విపక్షాల వ్యాఖ్యలు ఉన్నాయన్నారు. 131వ రాజ్యాంగ సవరణ బిల్లును సమాజ్‌వాదీ, ఎంఐఎం పార్టీలు వ్యతిరేకించాయి. దక్షిణాది ప్రాంతాలకు ప్రాతినిధ్యం లేకుండా ఈ బిల్లు చేస్తుందన్నారు. ఈ సవరణలు రాజ్యాంగ విరుద్ధమని, అవి శాండ్‌విచ్ బిల్లులని డీఎంకే ఆరోపించింది. మహిళా రిజర్వేషన్, రాజ్యాంగ సవరణ బిల్లులపై సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, హోం మంత్రి అమిత్ షాల మధ్య వాడీవేడి చర్చ జరిగింది. ఈ ప్రక్రియను జనగణనతో ప్రారంభించాలని అఖిలేశ్ తొలుత సూచించారు. కులగణనను కేంద్రం పట్టించుకోవట్లేదని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్‌పై కేంద్రం దూకుడులో అర్థం ఏమిటని ప్రశ్నించారు. 'మహిళా రిజర్వేషన్ల అమలుపై కేంద్రం ఎందుకు అంత తొందర ప్రదర్శిస్తోంది.. మొదటగా జనగణనతో ఈ ప్రక్రియను స్టార్ట్ చేయాలి' అని అన్నారు. మహిళా రిజర్వేషన్‌కు తన పార్టీ పూర్తి మద్దతు ఇస్తోందని ఆయన పునరుద్ఘాటించారు. కానీ డీలిమిటేషన్ ద్వారా రిజర్వేషన్ అమలును వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ వాదనపై అమిత్ షా ఘాటుగా స్పందించారు. 'దేశంలో ప్రస్తుతం జనగణన ప్రారంభమైంది.. ఆ తరువాత కుల ఆధారిత సెన్సెస్ కూడా ఉంటుంది.. ప్రస్తుతం గృహ గణన జరుగుతోంది.. ఇళ్లు కులాల వారీగా ఉండవు. కుదిరితే ఇళ్లకు కూడా సమాజ్‌వాదీ పార్టీ కులాన్ని జోడిస్తుంది.. కులగణనతో పాటు జనగణన జరుగుతుందని సభకు హామీ ఇస్తున్నా' అని అమిత్ షా అన్నారు.

# చెరువుల పునరుద్ధరణపై ఫోకస్

- **11 చెరువుల్లో గుర్రపుడెక్క తొలగింపు**
- **దోమల నివారణే లక్ష్యంగా ముమ్మరంగా సాగుతున్న పనులు**
- **మీదికుంట, గోపి చెరువుల్లో గుర్రపుడెక్కను తొలగిస్తున్న సిబ్బంది**

**హైదరాబాద్, ఏప్రిల్ 16, సిరి న్యూస్**

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని చెరువుల పునరుద్ధరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. నగరంలోని చెరువుల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతో పాటు దోమల ఉత్పత్తిని అరికట్టేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా సైబరాబాద్ వ్యాప్తంగా ఉన్న 11 చెరువుల్లో గుర్రపుడెక్క తొలగింపు ప్రక్రియను ముమ్మరం చేశారు. నీటి వనరుల చుట్టూ పేరుకుపోయిన గుర్రపుడెక్క వల్ల నీటి ప్రవాహానికి ఆటంకం కలగడమే కాకుండా, పరిసర ప్రాంతాల్లో దోమల బెడద విపరీతంగా పెరుగుతోందని గుర్తించిన అధికారులు ఈ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం జరుగుతున్న పనులలో భాగంగా శేరిలింగంపల్లి పరిధిలోని మీదికుంట మరియు గోపి చెరువుల్లో గుర్రపుడెక్క తొలగింపు ప్రక్రియ చురుగ్గా సాగుతోంది. ఈ చెరువుల్లో దట్టంగా పెరిగిన గుర్రపుడెక్కను యంత్రాల సహాయంతో క్లియర్ చేస్తున్నారు. దీనివల్ల నీటి ప్రవాహం మెరుగుపడటమే కాకుండా, చెరువుల నిర్వహణ సులభతరం అవుతుందని అధికారులు తెలిపారు. చెరువుల్లో నీరు నిల్వ ఉండి మురుగుగా మారకుండా చూడటం ద్వారా పరిసర కాలనీల ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించడమే తమ ప్రధాన ఉద్దేశమని సైబరాబాద్ మున్సిపల్ అధికారులు పేర్కొన్నారు. నగర జీవవైవిధ్యంలో కీలకమైన ఈ పట్టణ జలవనరులను కాపాడేందుకు నిరంతర పర్యవేక్షణ చేపడుతున్నట్లు అధికారులు వెల్లడించారు. పనులు నిరంతరం కొనసాగేలా మరియు తొలగించిన గుర్రపుడెక్క మళ్లీ పెరగకుండా ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ పునరుద్ధరణ పనుల వల్ల చెరువుల సుందరీకరణతో పాటు భూగర్భ జలాలు కూడా మెరుగుపడే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. పనులు జరుగుతున్న తీరును ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ సిబ్బందికి తగిన సూచనలు జారీ చేస్తున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా ఈ చెరువుల ప్రక్షాళన కార్యక్రమం కొనసాగుతోంది. కేవలం గుర్రపుడెక్క తొలగింపుతోనే ఆగకుండా, చెరువుల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయడం మరియు చెత్తాచెదారం వేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కార్పొరేషన్ యోచిస్తోంది. ప్రజలు కూడా తమ వంతు బాధ్యతగా చెరువుల్లో ప్లాస్టిక్ మరియు ఇతర వ్యర్థాలను వేయకూడదని అధికారులు విజ్ఞప్తి చేశారు. సైబరాబాద్‌ను పరిశుభ్రమైన మరియు ఆరోగ్యకరమైన నగరంగా తీర్చిదిద్దడంలో భాగస్వాములు కావాలని కోరారు. మున్సిపల్ కార్పొరేషన్ చేపట్టిన ఈ చర్యల పట్ల స్థానిక నివాసితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత కొన్నేళ్లుగా గుర్రపుడెక్క సమస్య వల్ల చెరువులు కుచించుకుపోవడమే కాకుండా, దుర్వాసన మరియు దోమలతో ఇబ్బందులు పడ్డామని, తాజా నిర్ణయంతో ఉపశమనం లభిస్తుందని వారు తెలిపారు. సైబరాబాద్ పరిధిలోని మిగిలిన చెరువుల్లో కూడా ఇదే విధంగా పనులు పూర్తి చేసి, పార్కుల్లా అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు. పనుల వేగవంతం కోసం మరిన్ని యంత్రాలను రంగంలోకి దించుతున్నట్లు కార్పొరేషన్ ప్రతినిధులు వెల్లడించారు.

# కలెక్టర్ ముందే మహిళ ఆత్మహత్యాయత్నం

**మునగాల (సూర్యాపేట), ఏప్రిల్ 16, సిరి న్యూస్:**

సూర్యాపేట జిల్లా మునగాల మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక' కార్యక్రమం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్, జిల్లా ఎస్పీ నరసింహ ఇతర ఉన్నతాధికారులు ప్రజల సమస్యలను వింటుండగానే, ఒక మహిళ అధికారుల ఎదుటే పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం తీవ్ర కలకలం సృష్టించింది. ప్రభుత్వ పథకాల అమలులో జరుగుతున్న అన్యాయాన్ని భరించలేక, నిరసనగా ఆమె ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ హఠాత్పరిణామంతో ఒక్కసారిగా సభా ప్రాంగణమంతా గందరగోళం నెలకొంది. వివరాల్లోకి వెళితే, మునగాల మండలంలోని తాడ్వాయి గ్రామాన్ని అధికారులు 'ఇందిరమ్మ ఇళ్ల పైలెట్ ప్రాజెక్టు' కింద ఎంపిక చేశారు. ఈ పథకం కింద గ్రామానికి చెందిన సునీత అనే మహిళకు ఇందిరమ్మ ఇల్లు మంజూరైనట్లు ప్రాథమికంగా సమాచారం అందింది. అయితే, అర్హురాలైన తన పేరును తొలగించి, ఆ ఇల్లును మరొకరికి కేటాయించారని సునీత ఆరోపించింది. అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడంతో, నేరుగా జిల్లా కలెక్టర్ పాల్గొన్న సభలోనే తన నిరసనను వ్యక్తం చేస్తూ తనతో తెచ్చుకున్న పురుగుల మందును తాగింది. అధికారుల కళ్ల ముందే ఈ ఘటన జరగడంతో అంతా షాక్‌కు గురయ్యారు. సునీత పురుగుల మందు తాగిన వెంటనే అక్కడున్న పోలీసులు మరియు సిబ్బంది అప్రమత్తమయ్యారు. ఆమెను హుటాహుటిన చికిత్స నిమిత్తం కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమెకు వైద్యులు అత్యవసర చికిత్స అందిస్తున్నారు. కాంగ్రెస్ నాయకులు తమ రాజకీయ అండదండలతో అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందకుండా చేస్తున్నారని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది. తన పేరు మీద వచ్చిన ఇల్లును రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి అధికారులు వేరే వారికి కట్టబెట్టడంపై ఆమె తీవ్రంగా స్పందించింది.

# డీలిమిటేషన్ తో అన్యాయం జరగదు

**న్యూఢిల్లీ, సిరి న్యూస్:**

లోక్‌సభలో మహిళల రిజర్వేషన్ బిల్లుతో పాటు డీలిమిటేషన్ అంశంపై తీవ్ర చర్చ కొనసాగుతున్న వేళ కేంద్ర హోం మంత్రి అమిత్ షా కీలక ప్రకటన చేశారు. దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరుగుతుందనే ప్రచారం తప్పని, డీలిమిటేషన్ వల్ల ఆ రాష్ట్రాలకు తగిన రీతిలో సీట్లు పెరుగుతాయని తెలిపారు. డీలిమిటేషన్‌పై విపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని, దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి అన్యాయం జరగదని స్పష్టం చేశారు.

డీలిమిటేషన్ అనంతరం ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం ఉన్న లోక్‌సభ స్థానాలు 25 నుంచి 38కి పెరుగుతాయని వెల్లడించారు. అలాగే తెలంగాణలో లోక్‌సభ సీట్లు 17 నుంచి 26కి పెరుగుతాయని తెలిపారు. తమిళనాడులో 39 నుంచి 59కి, కర్ణాటకలో 28 నుంచి 42కి, కేరళలో 20 నుంచి 30కి సీట్లు పెరుగుతాయని వివరించారు. మొత్తంగా సీట్లు సుమారు 50 శాతం పెరుగుతాయని తెలిపారు.

దక్షిణాది రాష్ట్రాల్లో జనాభా శాతం కంటే సీట్లు ఎక్కువగా పెరుగుతాయని అమిత్ షా పేర్కొన్నారు. విపక్షాలు అబద్ధాలు చెబుతూ ప్రజల్లో అనవసర ఆందోళనలు సృష్టిస్తున్నాయని విమర్శించారు. అన్ని ప్రాంతాలకు సమాన న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రస్తుతం 543 ఉన్న లోక్‌సభ సీట్లను డీలిమిటేషన్ తర్వాత దాదాపు 50 శాతం పెంచి సుమారు 850 వరకు పెంచే ప్రణాళిక ఉందని కేంద్రం వెల్లడించింది.

# ఢిల్లీలో ముఖ్యమంత్రికి ఘన స్వాగతం

- **పార్లమెంట్ ఆవరణలో సీఎం రేవంత్ రెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డిని సన్మానించిన మంత్రి సీతక్క**
- **ముఖ్యమంత్రితో మర్యాదపూర్వక భేటీ**
- **తెలంగాణ అభివృద్ధి ప్రణాళికలపై పార్లమెంట్ ప్రాంగణంలో చర్చలు**
- **రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రంపై ఒత్తిడి తెచ్చే వ్యూహాలపై దిశానిర్దేశం**

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 16, సిరి న్యూస్**



తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి దేశ రాజధాని ఢిల్లీ పర్యటనలో భాగంగా పార్లమెంట్ ఆవరణను సందర్శించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అలాగే రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకముగా కలిశారు. పార్లమెంట్ ప్రాంగణంలోనే రేవంత్ రెడ్డిని మంత్రి సీతక్క శాలువా కప్పి ఘనంగా సన్మానం చేశారు. ఈ భేటీకి సంబంధించిన వివరాలు సామాజిక మాధ్యమాల్లో అలాగే డిజిటల్ వేదికలపై విస్తృతంగా ప్రచారమవుతున్నాయి. ముఖ్యమంత్రి వెంట ఉన్న కీలక నేతలు ఆయనకు తమ మద్దతును ఈ విధంగా తెలియజేశారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన పర్యటనలో భాగంగా కేంద్ర ప్రభుత్వ పెద్దలతో భేటీ అవుతున్న తరుణంలో ఈ కలయిక ప్రాధాన్యత సంతరించుకుంది. పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో జరిగిన ఈ సమావేశంలో రాష్ట్రానికి సంబంధించిన పెండింగ్ నిధులు, విభజన హామీల అమలు వంటి కీలక అంశాలపై ప్రాథమిక చర్చలు జరిపారు. మంత్రి సీతక్క తన శాఖకు సంబంధించిన నిధుల విడుదల కోరుతూ కేంద్ర మంత్రులను కలిసేందుకు సిద్ధమవుతున్న తరుణంలో ముఖ్యమంత్రి సూచనలు తీసుకున్నారు. ఎంపీ వేం నరేందర్ రెడ్డి కూడా పార్లమెంట్‌లో అనుసరించాల్సిన వ్యూహాలపై ముఖ్యమంత్రితో చర్చలు జరిపినట్లు సమాచారం. ఈ భేటీ ద్వారా తెలంగాణ ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు పక్కా ప్రణాళికతో ఉన్నట్లు స్పష్టమవుతోంది.

రాష్ట్ర అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చేస్తున్న కృషిని మంత్రి సీతక్క కొనియాడారు. ఢిల్లీ స్థాయిలో రాష్ట్ర గళాన్ని బలంగా వినిపించేందుకు రేవంత్ రెడ్డి నిరంతరం శ్రమిస్తున్నారని ఆమె పేర్కొన్నారు. పార్లమెంట్ ఆవరణలో ముఖ్యమంత్రికి లభిస్తున్న గౌరవం తెలంగాణ రాష్ట్ర ప్రతిష్టను పెంచుతోందని అభిప్రాయపడ్డారు. నిరుపేదల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు కేంద్రం నుండి రావాల్సిన వాటాను సాధించేందుకు ఈ పర్యటన దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా తన బృందంతో కలిసి సమన్వయంతో ముందుకు వెళ్లాలని సూచించారు.

ఈ పర్యటనలో భాగంగా పలువురు కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్రానికి రావలసిన బకాయిలను విడుదల చేయాలని కోరే అవకాశం ఉంది. రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి పార్లమెంట్ వేదికగా తెలంగాణ సమస్యలను ప్రస్తావించేందుకు సమాయత్తమవుతున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో గడిపే సమయాన్ని రాష్ట్ర ప్రయోజనాల కోసం పూర్తిస్థాయిలో వినియోగించుకుంటున్నారు. వివిధ శాఖల పెండింగ్ ప్రాజెక్టుల నివేదికలను ఇప్పటికే సిద్ధం చేసి ఉంచారు. మంత్రి సీతక్క కూడా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం అదనపు నిధుల కోరుతూ కేంద్రానికి విన్నవించనున్నారు. ముగింపులో, పార్లమెంట్ ఆవరణలో జరిగిన ఈ సన్మాన కార్యక్రమం తెలంగాణ నేతల మధ్య ఉన్న ఐక్యతను చాటిచెబుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన ఢిల్లీ పర్యటన ద్వారా రాష్ట్రానికి మేలు జరిగేలా గట్టి ప్రయత్నం చేస్తున్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కేంద్రం నుండి సహాయ సహకారాలు పొందేందుకు ఈ చర్చలు కీలకం కానున్నాయి. ఈ పర్యటన ఫలితాలు భవిష్యత్తులో తెలంగాణ అభివృద్ధిపై సానుకూల ప్రభావం చూపుతాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ భేటీకి సంబంధించిన ఫోటోలు ఇప్పటికే ఇంటర్నెట్‌లో అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ప్రభుత్వం తదుపరి కార్యాచరణపై రాష్ట్ర ప్రజల్లో ఆసక్తి నెలకొంది.

# పట్టభద్రులవుతున్న ఎన్‌సీసీ క్యాడెట్లకు ఘన వీడ్కోలు



**రామచంద్రపురం, ఏప్రిల్ 16 (సిరి న్యూస్):**

హైదరాబాద్‌లోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో పట్టభద్రులవుతున్న ఎన్‌సీసీ క్యాడెట్లకు గురువారం ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. క్రీడలు, ఎన్‌సీసీ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో క్యాడెట్ల సేవాభావం, క్రమశిక్షణను గుర్తుచేసుకున్నారు.ముఖ్య అతిథిగా హాజరైన గీతం హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్. రావు పట్టభద్రులవుతున్న క్యాడెట్లను అభినందించారు. ఎన్‌సీసీ శిక్షణ విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, ధైర్యం, క్రమశిక్షణను పెంపొందించి దేశసేవకు దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు.రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, క్యాంపస్ లైఫ్ డైరెక్టర్ అంబికా ఫిలిప్ గౌరవ అతిథులుగా పాల్గొని క్యాడెట్ల అంకితభావాన్ని ప్రశంసించారు. ఈ సందర్భంగా శిక్షణ పూర్తిచేసుకుని లెఫ్టినెంట్ హోదా పొందిన అసోసియేట్ ఎన్‌సీసీ ఆఫీసర్ ఎస్. అజయ్ కుమార్‌ను అతిథులు సత్కరించారు.పట్టభద్రులవుతున్న క్యాడెట్లు తమ అనుభవాలను పంచుకోగా, జూనియర్ క్యాడెట్లు వారికి అభినందనలు తెలియజేశారు. క్యాడెట్లకు జ్ఞాపికలు అందజేసి, సాంస్కృతిక కార్యక్రమాలు, గ్రూప్ ఫోటోలతో కార్యక్రమం ఘనంగా ముగిసింది.

# వాక్సిన్ యూనివర్సిటీలో అరైవ్–అలైవ్ కార్యక్రమం




**మునిపల్లి, ఏప్రిల్ 16 (సిరి న్యూస్)**

సమాజంలో ప్రతి ఒక్కరు రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలని అదనపు డిజిపి మహేష్ మురళీధరన్ భగవత్ అన్నారు. మండలంలోని వోక్సన్ యూనివర్సిటీలో నిర్వహించిన అరైవ్–అలైవ్ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు.500 మందికి పైగా విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించడం, సీటు బెల్ట్ వినియోగం, అలసటతో డ్రైవింగ్ చేయకపోవడం వంటి నియమాలు పాటిస్తే ప్రమాదాలు తగ్గుతాయని సూచించారు. గోల్డెన్ అవర్‌లో సీపీఆర్ వంటి ప్రాణ రక్షక చర్యలపై కూడా అవగాహన అవసరమన్నారు.జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని చెప్పారు. దేశంలో రోజూ 370, తెలంగాణలో 18 మంది రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ద్విచక్ర వాహనదారుల నిర్లక్ష్యమే ప్రమాదాలకు ప్రధాన కారణమన్నారు.విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ అభిజిత్ శిరోద్కర్ పలు భద్రత అంశాలపై మాట్లాడారు.కార్యక్రమంలో డిఎస్పీ సత్తయ్య గౌడ్, సీఐలు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

# ఆరు గ్యారెంటీలు

## అమలవుతున్న ఐదు పథకాలపై ప్రగతి ప్రణాళిక




**ఏప్రిల్ 16 (సిరి న్యూస్)**

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీలు క్షేత్రస్థాయిలో జరుగుతున్న సంక్షేమ పథకాలపై ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక పై సమావేశం అధికారులు నిర్వహించారు. గురువారం కొండాపూర్ రైతువేదికల ఏర్పాటుచేసిన ప్రజా పాలన ప్రవగతి ప్రణాళిక మండల స్పెషల్ ఆఫీసర్ వైద్యనాథ్ ఆధ్వర్యంలో ఎంపీడీవో వేణుగోపాల్ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 6 గ్యారంటీలు, నూతనంగా అమలవుతున్న ఐదు పథకాలపై గ్రామస్థాయిలో జరుగుతున్న నివేదికలపై అధికారులు ఆరా తీశారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లు, రూ. 500వంట గ్యాస్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాలు అర్హులైన వారికి అందరం లేదని సూచించారు. గ్రామ ప్రజా ప్రతినిధులుగా అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలతో పాటు గ్రామ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. గ్రామాలలో నెలకొన్న విద్యుత్, మంచినీటి సరఫరా సమస్యలను పరిష్కరించాలని చర్చించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు అధికారులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక మండల సభ

**వెల్దుర్తి ఏప్రిల్ 16 (సిరి న్యూస్ ) :**




ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక గొప్ప కార్యక్రమని, గ్రామాభివృద్ధి, ప్రజలకు మౌలిక వసతుల కల్పనే ప్రధాన లక్ష్యంగా అధికారులు పని చేయాలని వెల్దుర్తి మండల పరిషత్ డెవలప్మెంట్ అధికారి ఉమాదేవి అన్నారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం మండల కేంద్రంలోని వెల్దుర్తి రైతు వేదిక వద్ద ఎంపీడీఓ ఉమాదేవి అధ్యక్షతన మండల స్థాయి ప్రత్యేక సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర గీతాన్ని ఆలపించి, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సందేశాన్ని అధికారులు వినిపించారు. అనంతరం వివిధ శాఖల అధికారులు మండలంలో వారి పరిధిలో అమలవుతున్న సంక్షేమ పథకాల అమలు తీరును వివరించారు. రైతు రుణ మాఫీ, రైతు బీమా, ఇందిరమ్మ ఇళ్లు, స్వయం సహాయక సభ్యులకు మంజూరైన వడ్డీ లేని రుణాల వివరాలు, కొత్త రేషన్ కార్డులు, పట్టాదారు పాసు పుస్తకాలు, సన్న బియ్యం పంపిణీ, వైద్య సేవలు, తదితర పథకాలకు సంబంధించి వివరాలను ప్రజలకు తెలియజేశారు. అదే విధంగా నూతన పథకాలైన ముఖ్యమంత్రి అల్పాహారం పథకం, ఇందిరమ్మ జీవిత కుటుంబ భీమా, మధ్యాహ్న భోజన పథకం ఇంటర్మీడియట్ కు విస్తరణ, విభిన్న ప్రతిభావంత ఇంటర్మీడియట్ విద్యార్థులకు మోటారు వాహనాలు, పంటల వైవిధ్యం, సహజ సేంద్రీయ వ్యవసాయం పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ( వెల్దుర్తి ఎంపీడీవో ) ఉమాదేవి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామ స్థాయిలోనే సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని అధికారులకు తెలిపారు. గ్రామ అభివృద్ధి కోసం ప్రజల భాగస్వామ్యం కీలకమని, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడం, పిల్లల విద్యపై దృష్టి పెట్టడం, ఆరోగ్య పరిరక్షణపై శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్,, యస్సై రాజు, ఏఓ ఝాన్సీ, ఎంఈఓ బుచ్చ నాయక్ , ట్రాన్స్ కో ఎఈ పెంట్య నాయక్ , ఆర్ఐ నర్సింగ్ యాదవ్ , ఎన్ఆర్ఈజీఎస్ ఏపిఒ రాజు, ఐకెపి ఏపిఎం, సుభాష్, పంచాయతీ కార్యదర్శులు ఆయా గ్రామ సర్పంచులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఎర్రోళ్ల కృష్ణకు దక్కిన దళిత రత్న అవార్డు

**కొంపల్లి.ఏప్రిల్,16( సిరి న్యూస్).**

బాబు జగ్జీవన్ రావ్ మరియు అంబేత్కర్ జయంతి ఉత్సవాల్లో భాగంగా కొంపల్లి నివాసి ఎర్రోళ్ల కృష్ణకు దళిత రత్న అవార్డు దక్కింది.అంబేత్కర్ 135వ జయంతిని పురస్కరించుకొని రవీద్ర భారతిలో ఏర్పాటు చేసిన అవార్డు కార్యక్రమానికి ఆహ్వానం అందగా మంగళవారం నాడు అక్కడికి నేతలు సుదర్శన్ బాబు, చెన్నయ్య.రేపాక అశోక్.వై.శ్రీనివాస్ ల చేతుల మీదగా దళిత రత్న అవార్డును అందుకోవడం జరిగింది.అనంతరం ఎర్రోళ్ల కృష్ణ ఓ ప్రకటలో మాట్లాడుతూ రాజ్యాంగ సృష్టికర్త బాబా సాహెబ్ అంబేత్కర్ జయంతి సందర్భంగా అవార్డు రావడం సంతోషంగా ఉందని దళిత జాతిలో పుట్టినందుకు నేడు సంతోషంగా ఉందని సంఘం ముందుకు పోవడానికి తనవంతుగా కృషి చేస్తానని అన్నారు. యువత భవిష్యత్తును మార్గదర్శకాలను అంబేత్కర్ అందించారని తన అడుగు జాడలో నడుచుకోవాలని పిలుపు నిచ్చారు. యువత విద్యావంతులుగా ఎదుగుతు రాజకీయాల్లోకి రావాలని ప్రతి ఇంట్లో ఒక్క అంబేత్కర్ ఉండాలని యువత చెడుదారుల్లో పోకుండా బంగారు భవిష్యతును ఎంచుకోవాలని అన్నారు.



# ప్రమాద క్షతగాత్రులను ఆసుపత్రికి తరలిస్తే.. 25వేల పారితోషికం

- **సంక్షేమ పథకాలపై మండల స్థాయి సమావేశం.**

**రామాయంపేట,(నిజాంపేట)ఏప్రిల్ 16(సిరి న్యూస్):**

రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను ఆసుపత్రికి చేర్పిస్తే రూ 25 వేల పారితోషికం అందించడం జరుగుతుందని ఎస్సై రాజేష్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని రైతు రైతు వేదికలో గురువారం రోజున ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పై మండల స్థాయి సమావేశం నిర్వహించారు.ముందుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల లబ్ధిదారుల జాబితాలను మండల ప్రత్యేక అధికారి చదివి వినిపించారు. అనంతరం మాట్లాడుతూ అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ పథకాలు అందేలా అధికారులు, సర్పంచులు కృషి చేయాలని తెలిపారు.




అలాగే రోడ్డు భద్రత నియమాలపై ఎస్సై రాజేష్ మాట్లాడుతూ తప్పకుండా ప్రతి వాహనదారుడు హెల్మెట్ ధరించి సురక్షితంగా ఇంటికి చేరాలని. ప్రతి ఒక్కరు వాహన పత్రాలతో పాటు, తమ డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ పత్రాలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ముఖ్యంగా మండలంలో బాల్యవివాహాలు జరిపిన, ప్రోత్సహించిన చట్టారీత్యా నేరమని ప్రతి ఒక్కరు బాల్యవివాలపై అవగాహన పెంచుకొని పూర్తిగా నిర్మూలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ రాజిరెడ్డి, ఎంపిఓ నరసింహారెడ్డి, వ్యవసాయ అధికారి సోమలింగారెడ్డి, మండల స్థాయి అధికారులు ఆయా గ్రామాల సర్పంచులు కార్యదర్శులు ప్రజా ప్రతినిధులు తదితరులు ఉన్నారు.

# బాటసారులకు బాసటగా సేవా కార్యక్రమం

- **తల్లిదండ్రుల జ్ఞాపకార్థం చలివేంద్రం**
- **సర్పంచ్ ఇప్ప పెంటారెడ్డి**

**గుమ్మడిదల, ఏప్రిల్ 16 (సిరి న్యూస్):**

వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో దాహార్తిని తీర్చేందుకు కానుకుంట గ్రామంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం బాటసారులకు ఆదరణగా నిలుస్తోంది. గుమ్మడిదల మండలంలోని కానుకుంట గ్రామంలో డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ చౌరస్తా వద్ద ఉన్న బస్ స్టాప్ సమీపంలో ఈ చలివేంద్రాన్ని గ్రామ సర్పంచ్ ఇప్ప పెంటరెడ్డి ప్రారంభించారు.గ్రామానికి చెందిన పోతురాజు సుధాకర్ తన తల్లిదండ్రులు పోతురాజు బాలనర్సయ్య, నర్సమ్మల జ్ఞాపకార్థంగా ప్రతి సంవత్సరం లాగే ఈ ఏడాది కూడా చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గత 15 సంవత్సరాలుగా వేసవికాలంలో నిరంతరంగా ఈ సేవా కార్యక్రమాన్ని కొనసాగిస్తూ బాటసారులకు, ప్రయాణికులకు, స్థానిక ప్రజలకు తాగునీటి సౌకర్యాన్ని అందిస్తున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఇప్ప పెంటరెడ్డి మాట్లాడుతూ ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న ఈ కాలంలో ఆసుపత్రికి వచ్చే




రోగులు, దూర ప్రాంతాలకు ప్రయాణించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటారు. అలాంటి సమయంలో చలివేంద్రం ఏర్పాటు చేసి దాహార్తిని తీర్చడం ఎంతో గొప్ప సేవ. పోతురాజు సుధాకర్ చేపడుతున్న ఈ కార్యక్రమం ఇతరులకు ఆదర్శంగా నిలవాలని అన్నారు.చలివేంద్రం వద్ద శుభ్రమైన తాగునీటిని అందుబాటులో ఉంచి, రోజంతా బాటసారులకు సేవలు అందిస్తున్నారు. గ్రామస్తులు ఈ కార్యక్రమాన్ని అభినందిస్తూ సుధాకర్ సేవా భావాన్ని కొనియాడుతున్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పాషా, రెవెన్యూ విఆర్ఓ సంతోష్, వార్డు సభ్యులు ఎర్రోళ్ల శంకర్, తుడుం ప్రభాకర్, గ్రామ నాయకులు కుమ్మరి వెంకటేష్, భార్గవచారి, విశాల్ గౌడ్, శ్రీశైలం, సాకలి మురళి, రమేష్, పోచయ్య, గ్రామ పెద్దలు శంకరయ్య, బాలరామ్, యువకులు నాగరాజు, ప్రభాకర్, సాయి, నరేష్ కుమార్, దానియేలు తదితరులు పాల్గొన్నారు. వేసవి కాలంలో చలివేంద్రాల ఏర్పాటు ద్వారా ప్రజలకు ఉపశమనం కలిగించడం మాత్రమే కాకుండా, సేవా భావాన్ని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడుతున్నాయని గ్రామస్థులు అభిప్రాయపడ్డారు.

# సింగూరు నుండి వన దుర్గ భవాని ప్రాజెక్టుకు సాగు నీరు రావడంతో

**కొల్చారం ఏప్రిల్ 16 (సిరి న్యూస్ )**

నర్సాపూర్ శాసనసభ్యురాలు సునీత లక్ష్మారెడ్డి ప్రత్యేకత చొరవతో వన దుర్గ మాత ప్రాజెక్టుకు సింగల్ నుండి త్రీ టిఎంసి నీరు వదలడంతో అన్నదాత ఆనందానికి అవధులు లేవు పరిధిలోని పైతర గ్రామానికి చెందిన యూత్ ఐకాన్ ఆ గ్రామ సర్పంచ్ రవితేజ రెడ్డి గ్రామ పరిసరాలకు నీరు అందడంతో రైతుల అందరితో కలిసి అక్కడికి వెళ్లి ఆనందం వ్యక్తం చేశారు సందర్భంగా రవితేజ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మెడలో వంచి అసెంబ్లీలో నర్సాపూర్ శాసనసభ్యురాలు సునీత లక్ష్మారెడ్డి వనదుర్గ ప్రాజెక్టు ఆయకట్టు రైతులకు సాగునీరు కచ్చితంగా రావాలని డిమాండ్ చేయడంతో ఎట్టకేలకు ప్రభుత్వం స్పందించి మూడు రోజుల క్రితం నీరు వదలడంతో కొల్చారం మండలానికి సాగునీరు చేరుకుంది దీంతో రైతులు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు



# ప్రజాపాలన కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పథకాలను ప్రతి అర్హులైన లబ్ధిదారులకు చేరవేయడం మండల సభల ప్రధాన లక్ష్యం

- గ్రామ స్థాయిలో సమస్యలను గుర్తించి తక్షణ పరిష్కారం అందించే దిశగా అధికారులు కృషి
- ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారం – మండల సభల ప్రధాన ఉద్దేశం
- మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్




**కొల్చారం ఏప్రిల్ 16.,(సిరి న్యూస్)**

ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మెదక్ జిల్లా కొల్చారం మండలం లో గురువారం మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ముఖ్య అతిథిగా హాజరై, జయ జయ హే తెలంగాణ రాష్ట్ర గీతంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలన కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పథకాలను ప్రతి అర్హులైన లబ్ధిదారులకు చేరవేయడం ప్రధాన లక్ష్యమని తెలిపారు. గ్రామ స్థాయిలో సమస్యలను గుర్తించి తక్షణ పరిష్కారం అందించే దిశగా అధికారులు కృషి చేయాలని సూచించారు. ప్రజలు తమ సమస్యలను నిర్భయంగా తెలియజేయాలని, ప్రభుత్వం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.మండల సమావేశంలో లేవనెత్తిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రజల నుండి వచ్చిన ప్రతి విజ్ఞప్తిని ప్రాధాన్యంగా పరిగణించి, నిర్ణీత కాలంలో పరిష్కారం చూపించాలని సూచించారు.గ్రామ స్థాయిలో ఎదురవుతున్న తాగునీరు, రహదారులు, విద్యుత్, ఇతర మౌలిక వసతుల సమస్యలను వెంటనే గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమర్థవంతమైన సేవలను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ప్రతి గ్రామంలో కనీసం పది మంది రైతులతో ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచిం చారు. ఆయిల్ పామ్ పంట ద్వారా రైతులకు అధిక ఆదాయం లభించే అవకాశాలు ఉన్నాయని, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను వినియోగించుకోవాలని కోరారు.రైతులకు అవసరమైన సాంకేతిక సూచనలు, శిక్షణలు అందిస్తూ ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించడంలో గ్రామ స్థాయి ప్రజాప్రతినిధులు గ్రామాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని తెలిపారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు సమర్థవంతంగా చేరవేయడంతో పాటు, ప్రతి ఇంటికి అవగాహన కల్పించే బాధ్యత సర్పంచ్‌లపై ఉందన్నారు. ఆయిల్ పామ్ వంటి లాభదాయక పంటలపై రైతులకు ప్రోత్సాహం కల్పించి, వ్యవసాయ రంగ అభివృద్ధికి తోడ్పడాలని ఆయన పేర్కొన్నారు.అనంతరం మండల సమాఖ్య సభ్యురాలు మాట్లాడుతూ మహిళా సంఘాల బలోపేతం, స్వయం ఉపాధి అవకాశాల పెంపు, గ్రామీణ అభివృద్ధిలో సంఘాల పాత్ర గురించి వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న సహాయంతో మహిళలు ఆర్థికంగా ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. ఇందిరమ్మ లబ్ధిదారులు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా తమకు స్థిరమైన నివాసం కలగడం ఎంతో సంతోషకరమని తెలిపారు. ఇంతకాలం ఎదుర్కొన్న గృహ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించిందని, తమ కుటుంబాలకు భద్రతతో కూడిన జీవనం అందిందని పేర్కొన్నారు. ప్రభుత్వం తమలాంటి పేదలకు ఇల్లు కల్పించడం ద్వారా జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయని కృతజ్ఞతలు తెలిపారు.అలాగే సంబంధిత అధికారులు పథకం అమలులో పారదర్శకతను పాటిస్తూ అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో తాసిల్దార్ శ్రీనివాసాచారి ప్రత్యేక అధికారి జిల్లా విద్యాశాఖ అధికారి విజయ, ఎంపీడీవో, రఫీక్ ఉన్నిసా బేగం సర్పంచ్ D. శేఖర్,.వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు



# సమస్యల పరిష్కారమే మా బాధ్యత

- చైర్మన్ కుమార్ గౌడ్
- 12వ వార్డులో సమస్యలు అడిగి తెలుసుకున్న చైర్మన్, కౌన్సిలర్స్

**గుమ్మడిదల, ఏప్రిల్ 16 (సిరి న్యూస్):**



మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడం తమ ప్రధాన బాధ్యత అని మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులో ఆయన స్థానిక నాయకులతో కలిసి పర్యటించి, ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా తాగునీటి కొరత, సిసి రోడ్ల పరిస్థితి, డ్రైనేజీ సమస్యలు, వీధి దీపాల లోపాలు వంటి పలు మౌలిక వసతుల సమస్యలను చైర్మన్ స్వయంగా పరిశీలించారు. స్థానిక ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకుని, వెంటనే పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.ఈ సందర్భంగా చైర్మన్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు అందించడం మున్సిపాలిటీ ప్రధాన కర్తవ్యం అన్నారు. తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, లైటింగ్ వంటి అంశాల్లో ఎలాంటి లోపాలు ఉండకూడదని. ప్రజల సమస్యలను ప్రాధాన్య క్రమంలో తీసుకుని తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించడం మా బాధ్యత. ప్రతి వార్డులో అభివృద్ధి సమానంగా జరిగేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, వార్డు కౌన్సిలర్ కత్తుల రమేష్, నాయకులు ఆకుల సత్యనారాయణ, సరెడ్డి గారి వెంకట్రాంరెడ్డి, పొన్నాల శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. స్థానిక కాలనీ ప్రజలు కూడా పెద్ద సంఖ్యలో హాజరై తమ సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు.

# మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ టీయూడబ్ల్యూజే ఘన సత్కారం

**రామాయంపేట, ఏప్రిల్ 16(సిరి న్యూస్ )**




తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్‌గా రెండవసారి బాధ్యతలు స్వీకరించిన ప్రముఖ సీనియర్ జర్నలిస్ట్ కె. శ్రీనివాస్ రెడ్డిని మెదక్ జిల్లా తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే) బృందం ఆత్మీయంగా సత్కరించింది. గురువారం నాడు హైదరాబాదులో జరిగిన టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో సన్మానించారు.జిల్లా ప్రతినిధులు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం నిరంతరం శ్రమించే వ్యక్తికి అకాడమీ బాధ్యతలు దక్కడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ రాబోయే రోజుల్లో జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఆయన మరింత కృషి చేస్తారని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

**పాత్రికేయ రంగ బలోపేతానికి కృషి**

ఈ కార్యక్రమంలో పాల్గొన్న మెదక్ జిల్లా టీయూడబ్ల్యూజే అధ్యక్షులు శంకర్ దయాళ్ చారి మాట్లాడుతూ జర్నలిజం రంగంలో అపార అనుభవం ఉన్న శ్రీనివాస్ రెడ్డి నాయకత్వంలో అకాడమీ జర్నలిస్టుల వృత్తి నైపుణ్యాలను మెరుగుపరచడానికి అలాగే వారి సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపడుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి జర్నలిస్టులకు మధ్య వారధిగా ఉంటూ అకాడమీని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా టీయూడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి సంతోష్ కుమార్ తో పాటు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.జి శ్రీనివాస్ శర్మ పాల్గొన్నారు. వీరితో పాటు వివిధ జిల్లాలకు చెందిన పలువురు సీనియర్ జర్నలిస్టులు, ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొని అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డికి అభినందనలు తెలియజేశారు. జర్నలిస్టుల ఐక్యతను చాటే విధంగా జరిగిన ఈ కార్యవర్గ సమావేశం ఆత్మీయ వాతావరణంలో ముగిసింది.

# అనారోగ్యంతో వ్యక్తి మృతి

- గ్రామస్థుల సహకారంతో అంత్యక్రియలు

**గుమ్మడిదల, ఏప్రిల్ 16 (సిరి న్యూస్):**



గుమ్మడిదల మండలంలోని అనంతారం గ్రామంలో నివాసం ఉంటున్న బోడపట్ల కొమరాయ్య అనారోగ్య కారణాలతో ఆకస్మికంగా మృతి చెందాడు. గత కొన్ని సంవత్సరాలుగా గ్రామంలో నివసిస్తూ జీవనం సాగిస్తున్న ఆయన మరణం స్థానికంగా విషాదాన్ని నింపింది. కొమరాయ్య కుటుంబ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు ముందుకు వచ్చి మానవత్వాన్ని చాటుకున్నారు. సీజీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి సహకారంతో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అనంతారం గ్రామపంచాయతీ సర్పంచ్ కొమ్ము శ్రీను, ఉప సర్పంచ్ ఊట్ల యాదిరెడ్డి, వార్డు సభ్యులు గొసుకొండ సాయిరెడ్డి, ఎల్లంకి భాస్కర్ తదితరులు పాల్గొని అంత్యక్రియలు జరిపించారు. గ్రామస్థులు పెరుగు లక్ష్మణ్, జింక గోపాల్, ఎల్లంకి సాయిగౌడ్, పెరుగు రమణ, తలారి నర్సింలు, కొమ్ము ప్రవీణ్, జింక భానుప్రకాశ్ తదితరులు సహకరించారు. గ్రామస్థులంతా కలిసి బాధిత కు టుంబానికి అండగా నిలిచి, మానవత్వాన్ని చాటుకోవడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ఇలాంటి సందర్భాల్లో సామాజిక బాధ్యతతో ముందుకు రావడం సమాజానికి ఆదర్శమని వారు తెలిపారు.

# ఏడుపాయల హుండీ లెక్కింపు

**పాపన్నపేట ఏప్రిల్ 16 (సిరి న్యూస్):**



ప్రసిద్ధి చెందిన ఏడుపాయల దేవస్థానం ఆలయ హుండీ లెక్కింపు గురువారం రోజు జరిగింది. ఆలయ ఈవో మఠం వీరేశం దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ రంగారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. 56 రోజులకు గాను 52 లక్షల 12,171 వచ్చినట్లు ఆలయ ఈఓ తెలిపారు. ఈ హుండీలో భాగంగా మిశ్రమ బంగారం 000.024.000 గ్రాములు మరియు మిశ్రమ వెండి 000.927.000 గ్రాములు వచ్చినట్లు తెలిపారు. ఈ హుండీ లెక్కింపు శ్రీ వెంకట అన్నమాచార్య సేవ ట్రస్ట్ సభ్యులు లెక్కించడం జరిగింది, వీరితోపాటు మెదక్ జిల్లా ఇండియన్ బ్యాంక్ సిబ్బంది ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, పాపన్నపేట పోలీస్, తదితరులు ఉన్నారు.

# ప్రజల అభిప్రాయాల మేరకే ఎస్టిపి ఏర్పాటు

## 18న అవగాహన సమావేశం ఎమ్మెల్యే జిఎంఆర్

**రామచంద్రపురం, ఏప్రిల్ 16 (సిరి న్యూస్):**



అమీన్పూర్ మున్సిపల్ పరిధిలో ప్రతిపాదించిన సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ (ఎస్టిపి) ఏర్పాటుపై ప్రజల అభిప్రాయాల మేరకే తుది నిర్ణయం తీసుకుంటామని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ఈ నెల 18వ తేదీన ప్లాంట్ ఏర్పాటు చేయనున్న స్థలంలోనే ప్రజలకు అవగాహన సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమృత్ 2.0 పథకం కింద పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని ఏడు చెరువుల వద్ద సుమారు రూ.1100 కోట్ల అంచనా వ్యయంతో సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఇందులో భాగంగా అమీన్పూర్ మున్సిపల్ పరిధిలోని 993 సర్వే నంబర్‌లో 10 ఎకరాల భూమిలో ఎస్టిపి నిర్మాణ పనులు ప్రారంభమైనట్లు పేర్కొన్నారు.అయితే ప్లాంట్ ఏర్పాటు వల్ల దుర్వాసన, ఆరోగ్య సమస్యలు తలెత్త వచ్చని సమీప కాలనీల ప్రజలు ఆందోళన వ్యక్తం చేసినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజల సందేహాలను నివృత్తి చేయడానికి సంబంధిత శాఖల అధికారులతో కలిసి సంయుక్త సమావేశం ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.అవసరమైతే హైదరాబాద్‌లో ఇప్పటికే పనిచేస్తున్న ఎస్టిపి ప్లాంట్లను ప్రజలకు చూపించి పూర్తి అవగాహన కల్పిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజల అభిప్రాయాలను గౌరవిస్తూ, వారి సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ముందుకు వెళ్తామని స్పష్టం చేశారు.సమావేశానికి ప్రభావిత కాలనీల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై తమ అభిప్రాయాలను తెలియజేయాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.

# ఘనంగా సీఈఓ జన్మదిన వేడుకలు



**కొల్చారం (సిరి న్యూస్ ) ఏప్రిల్ 16 :**

పిఎసి ఎస్ సీఈఓ పార్తిగారి కృష్ణ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. గురువారం మండల కేంద్రమైన కొల్చారం లో బస్టాండ్ స్వీట్ హౌస్ వద్ద స్నేహితులు, పెద్దల సమక్షంలో కేక్ కట్ చేసి సంబరాలు చేశారు. వేడుకలలో సంఘమేశ్వర్, సంజీవ్ రావు, చెన్నయ్య,చౌరి గారి చిన్న రాములు, రామకృష్ణ గౌడ్, అశోక్ గౌడ్, వై ఎస్,చంద్ర శేఖర్, సంతోష్,అనిల్, శ్రీధర్,భాస్కర్, నజీర్, శ్రీశైలం, రాయగిరి, శేకులు, నాగరాజు, వై కృష్ణ, సత్యనారాయణ, కృష్ణ తదితరులు ఉన్నారు.

# ఏసీబీ వలలో అసిస్టెంట్ డివిషనల్ ఇంజనీర్

**నల్గొండ ,ఏప్రిల్ 16 సిరి న్యూస్:**




ఒక బిల్లుకు సంబంధించి కాంట్రాక్టర్ నుండి 30వేల లంచం తీసుకుంటూ విద్యుత్ శాఖ ఏడిఈ సిరికొండ సైదులు గురువారం పట్టుబడ్డారు.నల్గొండ ఏసీబీ అధికారుల కథనం మేరకు నల్గొండ జిల్లా దేవరకొండ సబ్ డివిజినల్ ఇంజనీర్ ఏడీఈ.. రూ.10 లక్షల బిల్లు పాస్ చేసేందుకు రూ.30 వేల డిమాండ్ చేసారు.విద్యుత్ లైన్ల మరమ్మతులకు సంబంధించిన బిల్లును మంజూరు చేసేందుకు లంచం ఆశించిన నల్గొండ జిల్లా దేవరకొండ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ (ఏడీఈ) సిరికొండ సైదులు ఏసీబీ అధికారులకు అడ్డంగా దొరికిపోయాడు. కంబాలపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో అక్టోబర్ 2025లో వీచిన గాలివానకు దెబ్బతిన్న 33/11 కేవీ విద్యుత్ లైన్లను ఓ వ్యక్తి పునరుద్ధరించాడు. ఇందుకు సంబంధించిన రూ.10 లక్షల బిల్లును ప్రాసెస్ చేసి పై అధికారులకు పంపేందుకు సదరు ఏడీఈ రూ.30 వేలు డిమాండ్ చేశాడు. బాధితుడి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు, ఏప్రిల్ 16న తన కార్యాలయంలో లంచం డబ్బులు తీసుకుంటుండగా సైదులును రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొని, అతని వద్ద నుంచి నగదును స్వాధీనం చేసుకున్నారు. విధి నిర్వహణలో అవినీతికి పాల్పడిన నిందితుడిని అరెస్ట్ చేసి జ్యుడీషియల్ రిమాండ్ నిమిత్తం నాంపల్లిలోని ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరచనున్నట్లు అధికారులు వెల్లడించారు.

# మెదక్ ను జీరో యాక్సిడెంట్ జోన్ తీర్చిదిద్దాలి

- డ్రైవర్ల కంటి చూపు బాగా ఉంటేనే సురక్షిత ప్రయాణం.
- అతివేగం,డ్రంక్ అండ్ డ్రైవ్, ట్రాఫిక్ రూల్స్ పాటించకపోవడం ప్రమాదాలకు సాంకేతాలు
- జిల్లా ఎస్పీ డీవి శ్రీనివాసరావు
- వాహనదారులు బాధ్యతగా హెల్మెట్, సీటు బెల్ట్ ధరించాలి.
- ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ల పంపిణీ, సిగ్నేచర్ నిర్వహణ
- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్
- జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు.



**మెదక్ ఏప్రిల్,16(సిరిన్యూస్)**

జీరో యాక్సిడెంట్ జోన్ గా మెదక్ జిల్లాను తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్అన్నారు.99 రోజుల ప్రగతి ప్రణాళికలో అరైవ్ -అలైవ్ కార్యక్రమంలో భాగంగా మెదక్ బాలాజీ ఫంక్షన్ హాల్ లో రోడ్డు ప్రమాదాల నివారణపై ద్విచక్ర వాహనదారులు,కారు డ్రైవింగ్ చేసేవారు హెల్మెట్ సీట్ బెల్ట్ ధరించడం పై పోలీస్-రవాణా శాఖ సంయుక్త ఆధ్వర్యంలోఅవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఈ సమావేశంలోనే హార్ట్ ఎటాక్ గురైన వారికి సిపిఆర్ ద్వారా ప్రాణదానం చేయవచ్చు అనే నినాదంతో సర్దన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ ప్రత్యక్షంగా విద్యార్థులకు ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మెదక్ జిల్లాను జీరో యాక్సిడెంట్ జోన్ గా తీర్చిదిద్దాలని అన్నారు.పోలీస్ రవాణా శాఖ సమన్వయంతో నిర్వహించిన రోడ్డు ప్రమాదాల నివారణ, వాహనదారులు హెల్మెట్ సీట్ బెల్ట్ పెట్టుకోవడం వల్ల జరిగే ప్రాణ నష్టాలపై సుదీర్ఘంగా వివరించారు. జిల్లా ఎస్పీ డీవి శ్రీనివాసరావు మాట్లాడుతూ నివేదికల ప్రకారం, అతివేగం మరియు అజాగ్రత్త వల్ల తరచుగా మరణాలు సంభవిస్తున్నాయన్నారు.ఈ నేపథ్యంలో, రోడ్డు భద్రతా చర్యలను కఠినతరం చేసి ట్రాఫిక్ ఉల్లంఘనలు చేసిన వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవడమే పోలీస్ శాఖ ప్రధాన కర్తవ్యం గా ముందుకు పోతున్నామన్నారు.మెదక్ మున్సిపల్ చైర్మన్ రాధిక భూపతి రాజు మాట్లాడుతూ ప్రజల ప్రాణరక్షణ ధ్యేయంగా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.హెల్మెట్ సీట్ బెల్ట్ మన ప్రాణాలకు రక్షణ కవచంలా పనిచేస్తాయన్నారు. చిన్న నిర్లక్ష్యం వలనే ప్రమాదాలు అధికంగా జరుగుతాయన్నారు నేటి సమాజంలో యువత ఎక్కువగా ప్రమాదాలు బారిన పడుతున్నారని కుటుంబంలో కొడుకు ప్రమాదంలో చనిపోయినట్లయితే ఆ తల్లికి గర్భశోకం వెలకట్టలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ వాహనదారుడు కూడా నిబంధనలు తప్పనిసరి అన్నారు. ప్రయాణం ఎంత ముఖ్యమో గమ్యస్థానం చేరడం కూడా అంతే ముఖ్యం అని గుర్తుంచుకోవాలన్నారు. అనంతరం రోడ్డు ప్రమాదాల నివారణపై కవితల రూపంలో సభలో వినిపించారు.ఈ కార్యక్రమంలో,జిల్లా వైద్య అధికారి శ్రీరామ్,జిల్లా ట్రాన్స్ పోర్ట్ అధికారి వెంకట స్వామి, డి ఎస్పీ ప్రసన్న కుమార్,మున్సిపల్ చైర్మన్ కనుగు రాధిక భూపతి రాజ్,వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్,అధికారులు సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.





# రైతు బంధు నిలిపివేతపై హైకోర్టు ఆగ్రహం

- కోర్టు కేసులు ఉన్న భూ యజమానికి సంక్షేమ పథకాలు నిలిపివేయడం సరికాదు
- రైతు భరోసా, ధాన్యం కొనుగోలు పై చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్‌కు ఆదేశం.

**మెదక్ఏప్రిల్ 16(సిరిన్యూస్)**



సివిల్ కోర్ట్ తాత్కాలికంగా ఇచ్చిన ఇంజక్షన్ ఆర్డర్ ఆధారంగా సదరు రైతులకు రావాల్సిన రైతు బంధు, రైతు భరోసా ప్రయోజనాలను నిలిపివేయడంపై తెలంగాణ హైకోర్టు ఆక్షేపిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. మెదక్ జిల్లా నార్సింగ్ మండలంలోని సంకాపురం గ్రామానికి చెందిన రైతు ఎం. అంజిరెడ్డి భూములకు సంబంధించి రైతు బంధు మొత్తాలు నిలిపివేయడమే కాకుండా పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడం చట్టవిరుద్ధమని ప్రాథమికంగా గుర్తించిన న్యాయస్థానం, జిల్లా కలెక్టర్ తో సహా సంబంధిత అధికారులను వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.పిటిషనర్ల భూములు సుమారు 8 ఎకరాలు 32 గుంటలు ఉండగా, సివిల్ కోర్టు ఇచ్చిన తాత్కాలిక ఇంజంక్షన్ ఆర్డర్‌ను ఆధారంగా అధికారులు రైతు భరోసా, ధాన్యం కొనుగోలు ప్రయోజనాలను నిలిపివేశారు. అయితే ఆ ఇంజంక్షన్ కేవలం భూమిని విక్రయించకూడదు లేదా బదిలీ చేయకూడదనే పరిమితి మాత్రమే విధించిందని, రైతు సంక్షేమ పథకాలను నిలిపివేయడానికి అది కారణం కాలేదని హైకోర్టు స్పష్టం చేసింది.ఈ నేపథ్యంలో హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులుగా జిల్లా కలెక్టర్, రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్, తహసీల్దార్‌లను పిటిషనర్లకు రావాల్సిన రైతు రైతు భరోసా నిధులను తక్షణమే విడుదల చేయాలని, పిటిషనర్ల భూమిలో పండించిన ధాన్యాన్ని 'ఇందిరా కిసాన్ పథకం' కింద కొనుగోలు చేయడానికి అనుమతించాలని కూడా స్పష్టం చేసింది. పిటిషనర్ల తరఫున న్యాయవాది ఎల్. ప్రీతమ్ రెడ్డి వాదనలు వినిపిస్తూ, సివిల్ కోర్టు ఇంజంక్షన్ ఉన్నా రైతు భరోసా నిలిపివేయడం చట్టబద్ధం కాదని, రైతుల జీవనాధారంపై తీవ్ర ప్రభావం పడుతోందని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ఈ వాదనలను పరిగణలోకి తీసుకున్న హైకోర్టు పై మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.ఈ వ్యవహారంపై ప్రతివాదికి నోటీసులు జారీ చేసిన హైకోర్టు, కేసును తదుపరి విచారణకు జూన్ 16కు వాయిదా వేసింది. రైతు సంక్షేమ పథకాల అమలులో అధికారుల చర్యలపై ఈ ఉత్తర్వులు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.ఇదిలా ఉండగా మెదక్ సివిల్ కోర్టు లో సీనియర్ న్యాయవాది బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు వి ప్రతాప్ రెడ్డి వాదించగా,హైకోర్ట్ లో న్యాయవాది ప్రీతంరెడ్డి వాదించారు.

# ముందస్తు అడ్మిషన్లపై చర్యలు తీసుకోవాలి

- వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో కలెక్టర్కు వినతి



**హన్మకొండ(సిరిన్యూస్):** ప్రభుత్వ నియమ నిబంధనలకు విరుద్ధంగా విద్యా సంవత్సరం పూర్తికాకముందే ముందస్తు అడ్మిషన్లు చేపడుతున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల గుర్తింపును తక్షణమే రద్దు చేయాలని వామపక్ష విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. గురువారం హన్మకొండ జిల్లా కలెక్టర్కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎఐఎఫ్ డిఎస్ రాష్ట్ర కార్యదర్శి గడ్డం నాగార్జున, ఏఐఎస్ బి రాష్ట్ర కార్యదర్శి హకీం నవీద్ లు మాట్లాడుతూ జిల్లాలో ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు ముందస్తు అడ్మిషన్లు చేపట్టడం ద్వారా తల్లిదండ్రులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అదేవిధంగా పాఠశాలల ఆవరణలోనే పాఠ్యపుస్తకాల విక్రయాలు జరపడం అనైతికమని, పుస్తకాలను ఎమ్మార్పీ ధరలకు మించి విక్రయిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై జిల్లా అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఫీజు నియంత్రణ చట్టాన్ని ఈ విద్యా సంవత్సరం నుంచే ఖచ్చితంగా అమలు చేయాలని కోరారు. ఇందుకోసం నియమించిన కమిటీ ద్వారా పూర్తి వివరాలు సేకరించి ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజులను నియంత్రించాలని తెలిపారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో తగిన మౌలిక వసతులు కల్పించి, జిల్లాలో ఖాళీగా ఉన్న డీఈఓ, ఎంఈఓ, టీచింగ్, నాన్-టీచింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల హక్కులను పరిరక్షిస్తూ విద్యారంగాన్ని బలోపేతం చేయడానికి జిల్లా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ నియమాలను ఉల్లంఘిస్తున్న ప్రైవేట్ విద్యాసంస్థలపై తక్షణ చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ ఎఫ్ హన్మకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి భాష బోయిన సంతోష్, పిడిఎస్ యు ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.నరసింహారావు, పిడిఎస్ యు హన్మకొండ అధ్యక్షుడు బి.వంశీకృష్ణ, పిడిఎస్ యు హన్మకొండ-వరంగల్ జిల్లా అధ్యక్షుడు బోయినపల్లి అజయ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శులు బొజ్జు జ్యోతి, లావణ్య, జిల్లా ఉపాధ్యక్షుడు జక్కుల భాను ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## బసవేశ్వర జయంతిని అధికారికంగా నిర్వహించాలి



**వాంకిడి(సిరిన్యూస్)**
: మహాత్మా బసవేశ్వరుని జయంతి వేడుకలను ప్రభుత్వం తరపున అధికారికంగా, ఘనంగా నిర్వహించాలని కోరుతూ జంగం సంక్షేమ సంఘం వాంకిడి మండల శాఖ నాయకులు స్థానిక తహసిల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు దీకొండ మహేష్, ఉపాధ్యక్షుడు విభూతి శివశంకర్ మాట్లాడుతూ సమాజంలో సమానత్వం కోసం, మూఢనమ్మకాల నిర్మూలన కోసం పోరాడిన గొప్ప సంస్కర్త బసవేశ్వరుడని కొనియాడారు. ఆయన ఆశయాలను నేటి తరానికి చాటిచెప్పేలా ప్రభుత్వ యంత్రాంగం ఆధ్వర్యంలో జయంతి వేడుకలను జరపాలని వారు కోరారు.

## డిమాండ్ల సాధనకై టీజీఈ జేఏసీ సన్నద్ధం



**ఆసిఫాబాద్ టౌన్ (సిరిన్యూస్)**
: జిల్లా కేంద్రంలోని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం భవనంలో గురువారం సాయంత్రం టీజీఈ జేఏసీ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి టీజీఈ జేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమర్ హుస్సేన్ అధ్యక్షత వహించారు. ఉద్యోగుల పెండింగ్‌లో ఉన్న వివిధ డిమాండ్ల సాధన కోసం భవిష్యత్తులో చేపట్టబోయే కార్యాచరణపై ఈ సందర్భంగా సుదీర్ఘంగా చర్చించారు. ఉద్యోగులందరూ ఐక్యంగా ఉండి తమ హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. అనంతరం జేఏసీ నాయకులు జిల్లా పాలనాధికారిని కలిసి తమ డిమాండ్లకు సంబంధించిన ముందస్తు సమాచార వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల ప్రతినిధులు ఏటుకూరి శ్రీనివాసరావు, కొంపల్లి ఉషన్న, గరిపెల్లి కరుణాకర్ గౌడ్, ఆడే శ్రావణ్, సమ్మట అకిల్ కృష్ణ, లకావత్ శంకర్, ఉప్రే వినేష్, డెటి జ్యోతి, సంధ్యా, శార్వాణి, శ్రీపద, నాగుల శ్రీనివాస్, మధుకర్, అన్నం, శ్రీనివాస్ కుమార్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## తైబజార్ సమస్య పరిష్కరించాలి



**హత్నూర(సిరిన్యూస్)**
: మండలంలోని కాసాల-దౌల్తాబాద్ గ్రామాల రెవెన్యూ పరిధిలో నెలకొన్న తైబజార్ సమస్యను వెంటనే పరిష్కరించాలని కాసాల గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు కోరారు. గురువారం ఎంపీడీఓ, ఎంపీఈఓలకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా ఇరు గ్రామాల మధ్య తైబజార్ అంశం పెద్ద సమస్యగా మారిందని తెలిపారు. దౌల్తాబాద్ తైబజార్ను వేలం పాటలో దక్కించుకున్న గుత్తేదారులు నిబంధనలను అతిక్రమిస్తూ దౌల్తాబాద్ రెవెన్యూ పరిధిని దాటి కాసాల గ్రామ పంచాయతీ పరిధిలో తైబజార్ వసూళ్లు చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయాన్ని పలుమార్లు దౌల్తాబాద్ పంచాయతీ కార్యదర్శి, పాలకవర్గం దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు సమస్యకు పరిష్కారం లభించలేదని అన్నారు. ప్రస్తుతం దౌల్తాబాద్ పంచాయతీ తైబజార్ కాలపరిమితి ముగియడంతో ఈనెల 17న తైబజార్ వేలం జరగనున్న నేపథ్యంలో శివారు పరిధికి సంబంధించిన స్పష్టమైన నిబంధనలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు నగేష్, ప్రతాప్, సాగర్, గ్రామస్తులు రాంచందర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## తహశీల్దార్ ఇమ్రాన్కు ఘన సన్మానం



**నేరడిగొండ (ఇచ్చోడ)(సిరిన్యూస్)**
: ఇచ్చోడ మండల తహశీల్దార్గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఇమ్రాన్కు గురువారం ఘన సన్మానం నిర్వహించారు. ఇచ్చోడ మండలంలోని వివిధ గ్రామాల బీఆర్ఎస్ పార్టీ సర్పంచుల సంఘం అధ్యక్షుడు రాథోడ్ రమేష్ ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఉన్న రెవెన్యూ సమస్యలు, వాటి పరిష్కారం గురించి సర్పంచులు చర్చించారు. గ్రామాల అభివృద్ధికి అవసరమైన పరిపాలనా సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పలువురు సర్పంచులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ పత్తి విత్తనాల రవాణా గుట్టురట్టు

- 150 కేజీల విత్తనాలు స్వాధీనం .. ముగ్గురు అరెస్ట్
- పరారీలో ప్రధాన సూత్రధారి
- మంచిర్యాల డిసిపి ఎ.భాస్కర్



**తాండూర్(సిరిన్యూస్):** నకిలీ పత్తి విత్తనాలు కొనుగోలు చేసి రైతులు నష్టపోవద్దని మంచిర్యాల డిసిపి ఎ.భాస్కర్ సూచించారు. నకిలీ పత్తి విత్తనాల రవాణా గుట్టురట్టు చేసినట్లు పేర్కొన్నారు. గురువారం తాండూర్ పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. బుధవారం సాయంత్రం బోయపల్లి బోర్డు జాతీయ రహదారిపై ఆటోలో బెల్లంపల్లి నుంచి తాండూర్కు నకిలీ పత్తి విత్తనాలు తరలిస్తున్నారనే సమాచారంతో తాండూర్ ఎస్సై కె.ప్రసాద్, మండల వ్యవసాయాధికారి కె.సుష్మ, పోలీసు సిబ్బంది అక్కడికి చేరుకొని తనిఖీలు నిర్వహించారు. ఆటోలో నకిలీ పత్తి విత్తనాలు ఉన్నట్లు గుర్తించి మొత్తం 150 కేజీల విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో బోయపల్లి బోర్డుకు చెందిన పూస సుబ్బారావు (ఎస్జీటీ ఉపాధ్యాయుడు, నారాయణపూర్ ఎస్సీ కాలనీ), తాండూర్ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన ఓగరి సమ్మయ్య, ఆటో డ్రైవర్ మగ్దూంలను అరెస్ట్ చేశారు. ఈ నకిలీ విత్తనాలను కర్నూలు జిల్లాకు చెందిన గుంటుపల్లి శ్రీనివాసరావు వద్ద కొనుగోలు చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. కాగా ప్రధాన సూత్రధారి పరారీలో ఉన్నట్లు తెలిపారు. నకిలీ పత్తి విత్తనాలు రవాణా చేయడం, కొనుగోలు చేయడం వంటి చర్యలకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపడంతో పాటు పిడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇలాంటి నకిలీ విత్తనాలు వాడటం ద్వారా భూమి సారవంతం తగ్గి పంట దిగుబడి తగ్గే ప్రమాదం ఉందని, అలాగే పర్యావరణంపై కూడా ప్రతికూల ప్రభావం పడుతుందన్నారు. గ్లైపోసేట్ కలిగిన నకిలీ విత్తనాలు వాడటంతో రైతులకు చర్మ సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని తెలిపారు. రైతులు ప్రభుత్వం సరఫరా చేసే, లైసెన్సు పొందిన ఫెర్టిలైజర్ దుకాణాల్లో మాత్రమే విత్తనాలు, మందులు కొనుగోలు చేసి రశీదు తీసుకోవాలని సూచించారు. దళారుల మాటలు నమ్మి నకిలీ విత్తనాలు కొనుగోలు చేయకుండా అప్రమత్తంగా ఉండాలని కోరారు. గ్రామాల్లో ఎక్కడైనా నకిలీ పత్తి విత్తనాల విక్రయం జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని అన్నారు. ఈ సమావేశంలో బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్, తాండూర్ సీఐ ఎన్. దేవయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# అభివృద్దే లక్ష్యంగా అందరూ కలిసి పనిచేయాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్




**మంచిర్యాల(సిరిన్యూస్):** ప్రజా సంక్షేమం, అభివృద్దే లక్ష్యంగా అధికారులు, ప్రజాప్రతినిధులు అందరూ సమన్వయంతో కలిసి పనిచేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ప్రజాపాలన– ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా గురువారం చెన్నూర్ మండల కేంద్రంలోని మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో నిర్వహించిన మండల స్థాయి సమావేశంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, తహశీల్దార్ మల్లికార్జున్, ఎంపీడీఓ మోహన్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ మహేష్ ప్రసాద్ తివారి, సీఐ బన్సీలాల్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో సమర్ధవంతంగా అమలు చేసి అర్హులైన లబ్ధిదారులకు పథకాల ఫలాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతు సంక్షేమంలో భాగంగా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా పంటను కొనుగోలు చేస్తున్నామని, సన్నరకం వడ్లకు బోనస్ అందిస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో జిల్లాలో సుమారు 3,500 ఇండ్లు స్లాబ్ స్థాయికి చేరుకున్నాయని, అర్హులై దరఖాస్తు చేసుకున్న వారికి ఇళ్లు మంజూరు చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వం అందించే ఉచిత ఇసుకను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కళ్యాణ లక్ష్మీ, పెన్షన్, రేషన్ కార్డులు వంటి పథకాలను అర్హులందరికీ అందించేలా చర్యలు కొనసాగుతున్నాయని అన్నారు. జిల్లాలో పెన్షన్ కోసం దాదాపు 9వేల దరఖాస్తులు అందాయని, నిబంధనల ప్రకారం పరిశీలించి అర్హులకు మంజూరు చేయనున్నట్లు వివరించారు. చెన్నూర్ పట్టణంలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభానికి సిద్ధంగా ఉందని, అలాగే వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం తుది దశకు చేరుకుందని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలు పెరుగుతున్నాయని, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు. గ్రామాలు, పట్టణాల్లో రహదారులు, మురుగు కాలువలు, సౌర విద్యుత్ దీపాలు వంటి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. డిఎంఎఫ్ టి, సిఎస్ఆర్ నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని, మంజూరైన నిధులను ప్రణాళిక ప్రకారం వినియోగించాలని అధికారులకు సూచించారు. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. సోలార్ పవర్ ప్లాంట్లు, పెట్రోల్ బంక్ నిర్వహణ వంటి అవకాశాలను స్వయం సహాయక సంఘాలకు కల్పిస్తున్నామని, చెన్నూర్లో కూడా అనువైన ప్రదేశంలో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు స్వీకరిస్తామని అన్నారు. అనంతరం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన "అరైవ్ అలైవ్"రోడ్డు భద్రత కార్యక్రమంలో పాల్గొని రహదారి భద్రతా నిబంధనలపై ప్రతిజ్ఞ చేయించారు. వాహనదారులు హెల్మెట్, సీట్బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. అంతకుముందు చెన్నూర్ పట్టణంలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ప్రారంభానికి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అమృత్ 2.0 పథకం కింద గెర్రె కాలనీ, మార్కెట్ యార్డు ప్రాంతాల్లో నిర్మిస్తున్న నీటి ట్యాంకుల పనులను పరిశీలించి వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.





# దోమల వృద్ధిని అరికట్టి వ్యాధులను నియంత్రించాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల(సిరిన్యూస్):** వ్యాధుల నియంత్రణలో భాగంగా దోమల వృద్ధిని అరికట్టేందుకు సమగ్ర చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. ప్రజాపాలన– ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా గురువారం నస్పూర్లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవనంలోని సమావేశ మందిరంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అనిత, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ దర్నీ మధుకర్, డిప్యూటీ మేయర్ సల్లా రమ్య, ప్రభుత్వ ఆసుపత్రి పర్యవేక్షకులు డాక్టర్ వేదవ్యాస్, టి–హబ్ ప్రతినిధి డాక్టర్ శిల్ప తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఈనెల 16 నుంచి మే 15 వరకు వెక్టర్–బోర్న్ వ్యాధుల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని అన్నారు. దోమలు, టిక్స్, ఫ్లీలు ద్వారా వ్యాప్తి చెందే మలేరియా, డెంగ్యూ, ఫైలేరియా వంటి వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి నివారించేందుకు వైద్య శాఖ ముందుండి పనిచేయాలని తెలిపారు. గ్రామాలు, పట్టణాల్లో గుంతలు పూడ్చడం, మురుగు కాలువలు శుభ్రపర్చడం, నిల్వ నీరు తొలగించడం వంటి పారిశుద్ధ్య చర్యలను క్రమం తప్పకుండా చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో ప్రత్యేక శుభ్రత కార్యక్రమాలు నిర్వహించి నెలవారీ ప్రణాళిక అమలు చేయాలన్నారు. జూన్ 12న విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందు పాఠశాలలను పూర్తిగా శుభ్రపర్చి దోమల మందు పిచికారీ చేయాలని పేర్కొన్నారు. ఇంటి పరిసరాల్లో పరిశుభ్రత పాటించడం, కిటికీలకు జాలీలు అమర్చడం, దోమతెరలు వినియోగించడం ద్వారా దోమల నుంచి రక్షణ పొందవచ్చని ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. బోదకాలు నివారణకు డిఇసి మాత్రలు వినియోగించడం ద్వారా ఉపశమనం కలుగుతుందని అన్నారు. అలాగే వేసవికాలం కావడంతో వడదెబ్బ నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. మధ్యాహ్నం 12గంటల నుంచి 4గంటల వరకు ఎండ తీవ్రత అధికంగా ఉండే అవకాశం ఉన్నందునా ఆ సమయంలో బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. వడదెబ్బ తగిలిన వ్యక్తిని వెంటనే నీడ ప్రాంతానికి తీసుకెళ్లి అవసరమైతే 108 ద్వారా ఆసుపత్రికి తరలించాలని చెప్పారు. విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీపీఓ ప్రశాంతి, సబ్ యూనిట్ అధికారి సీహెచ్ వెంకటేశ్వర్లు, ఎంటిఏస్ శ్రీనివాస్, కిరణ్, ఆర్ఎస్ పద్మ వసుమతి, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# పోడు రైతులకు బీఆర్ఎస్ మద్దతు



**కాగజ్నగర్(సిరిన్యూస్):** సిర్పూర్ నియోజకవర్గంలో పోడు భూములపై జీవనం సాగిస్తున్న రైతుల సమస్యలు తీవ్రమవుతున్నాయని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు కొంగ సత్యనారాయణ అన్నారు. గురువారం పోడు రైతులకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదాపు 60 సంవత్సరాలుగా తమ తాతల కాలం నుంచి ఈ భూములను నమ్ముకుని జీవిస్తున్న రైతుల్లో చాలా మందికి పట్టాలు ఉన్నప్పటికీ, ప్రస్తుత ప్రభుత్వం వారి జీవనోపాధిని సంక్షోభంలోకి నెట్టేస్తోందని విమర్శించారు. పెద్దబండ, దిందా, చీలపెల్లి, ఆరెగూడ గ్రామాల్లో పోడు భూముల సమస్య మరింత తీవ్రంగా ఉందని తెలిపారు. రైతులు తమ భూముల్లో వ్యవసాయం చేయడానికి వెళ్లినప్పుడు అటవీ శాఖ అధికారులు కేసులు నమోదు చేసి అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం వారిని గ్రామాల నుంచి బలవంతంగా ఖాళీ చేయించే ప్రయత్నాలు చేస్తోందని అన్నారు. పోడు రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ నాయకత్వంలో రైతుల పక్షాన పోరాటానికి సిద్ధంగా ఉన్నామని, ఎట్టి పరిస్థితుల్లోనూ వెనుకంజ వేయబోమని స్పష్టం చేశారు. రైతుల సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

# బోర్ వేశారు.. మోటారు మరిచారు

## తాగునీటి కోసం మేదరివాడ ప్రజల ఆవేదన



**తాండూర్(సిరిన్యూస్):** తాండూర్ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని మేదరివాడలో తాగునీటి సమస్య మళ్లీ తలెత్తింది. వాటర్ ట్యాంక్కు గత కొన్నేళ్లుగా ఉన్న బోరు బావి సరిపడా నీటిని అందించకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత వేసవి కాలంలో కూడా తాగునీరు సరిగా అందకపోవడంతో మేదరివాడ ప్రజలు తాండూర్కు వెళ్లే ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఆ సమయంలో అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని వాటర్ ట్యాంక్ సమీపంలో మరో బోరు బావి ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. దీని ప్రకారం గత నెలలో గ్రామపంచాయతీ అధికారులు మేదరివాడ వాటర్ ట్యాంక్ దగ్గర కొత్తగా బోరు బావి తవ్వించారు. అయితే బోరు తవ్వినప్పటికీ ఇప్పటివరకు మోటారు బిగించకపోవడంతో అది ఉపయోగంలోకి రాలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వేసవి కాలం కావడంతో తాగునీటి అవసరం మరింత పెరిగిందని, వెంటనే కొత్తగా తవ్విన బోరుకు మోటారు అమర్చి ప్రజలకు సరిపడా తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు సంబంధిత అధికారులను కోరుతున్నారు.

# జిందాబాద్ కార్యక్రమం కింద సేవా కార్యక్రమాలు



**కాగజ్నగర్(సిరిన్యూస్):** జిందాబాద్ కార్యక్రమంలో భాగంగా సిర్పూర్ (టి)–కాగజ్నగర్ మధ్య ఉన్న పెద్దబండ రైల్వే బ్రిడ్జ్ వద్ద ఏర్పడిన గుంతలను మట్టి నింపి గురువారం మరమ్మతులు చేశారు. ప్రజల ప్రయాణానికి ఇబ్బందులు కలగకుండా ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిర్పూర్(టి) ఎస్సై సాగర్, కానిస్టేబుళ్లు సాయి, శశికాంత్ పాల్గొన్నారు. అదేవిధంగా ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల కోసం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ వారి అవసరాలను తెలుసుకున్నారు. ప్రజల సౌకర్యార్థం చేపట్టిన ఈ సేవా కార్యక్రమాలను స్థానికులు అభినందించారు. ప్రత్యేకంగా కార్యక్రమానికి నాయకత్వం వహించిన సిర్పూర్(టి) ఎస్సై సాగర్ను స్థానికులు ప్రశంసించారు.

## ఈ నాలుగు ప్రశ్నలతో

# మూడు ముళ్లకు ఢోకా ఉండదు..!



చావు, పుట్టుకలు దైవ ఆధీనం.. కానీ, పెళ్లి అనేది ప్రతి ఒక్కరూ తమ ఇష్టానుసారంగా, తమకు ఇష్టమైన వ్యక్తినే మనువాడుతారు. కుటుంబ సభ్యుల అనుమతితో, వేల మంది సమక్షంలో అమ్మాయి, అబ్బాయి వివాహ బంధంలోకి అడుగులు వేస్తారు. పెళ్లి తరువాత ఒకరి కష్ట సుఖాలు ఒకరు తెలుసుకోని నూరేళ్లు కలిసి ఉంటే ఓ పవిత్ర బంధం. పూర్వం చాలా వివాహాలు విజయవంతంగా కొనసాగాయి. కానీ, నేడు తరం మారింది. ఈ రోజుల్లో పెళ్లి అయిన గంటల వ్యవధిలోనే విడాకులు జరుగుతున్న సంఘటనలు అనేకం చూస్తున్నాం. ప్రేమ పెళ్లిళ్లు కూడా మూడు ముళ్లు పడ్డ కొద్ది రోజుల్లోనే విచ్ఛిన్నం అవుతున్నాయి. వీటిలో చాలా వరకు కారణం సరైన అనుకూలత లేకపోవడమే. ప్రేమ పెళ్లికి కొంత వెసులుబాటు ఉంది. పెళ్లికి ముందే అమ్మాయి, అబ్బాయి పరిచయం ఉండడం వల్ల ఒకరినొకరు అర్థం చేసుకునే సమయం ఉంటుంది. కానీ పెద్దలు కుదిర్చిన వివాహంలో అది సాధ్యపడదు. అందుకే పెద్దలు కుదిర్చిన వివాహం అయితే జీవిత భాగస్వామిని ఎన్నుకునేటప్పుడు తొందరపడకూడదు.. లేకపోతే భవిష్యత్తులో సంబంధం విచ్ఛిన్నం కావచ్చు. వివాహం చేసుకునే వ్యక్తి తన భవిష్యత్తు భాగస్వామి గురించి కొన్ని ముఖ్యమైన విషయాలను తెలుసుకోవడం చాలా ముఖ్యం. భవిష్యత్తులో సంబంధాన్ని బలంగా ఉంచుకోవడానికి మీరు పెళ్లికి ముందే మీ కాబోయే భాగస్వామిని ఖచ్చితంగా కొన్ని ప్రశ్నలు అడగాలి.

### 1 పెళ్లికి సిద్ధమేనా..?

ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలకు ప్రపంచంలోనే ఉత్తమ భాగస్వామి దొరకాలని కోరుకుంటారు, కానీ పెళ్లి చేసుకునే వ్యక్తి దానికి అంగీకరించడం చాలా ముఖ్యం. కాబట్టి మీరు వివాహం చేసుకోబోయే వ్యక్తిని అడగవలసిన మొదటి ప్రశ్న ఏమిటంటే..ఆ వ్యక్తి ఈ వివాహానికి పూర్తిగా సిద్ధంగా ఉన్నారా, వారిపై ఏదైనా ఒత్తిడి ఉందా అనేది. చాలా సార్లు అబ్బాయి లేదా అమ్మాయి కుటుంబ ఒత్తిడితో వివాహం చేసుకుంటారు, కానీ ఆ సంబంధం భవిష్యత్తును భద్రపరచడం కష్టమవుతుంది.

### 2 ఏం ఆశిస్తున్నారు..?

వివాహానికి ముందు అబ్బాయి, అమ్మాయి ఇద్దరూ తమ భవిష్యత్తు భాగస్వామి ఎలాంటి జీవిత భాగస్వామిని కోరుకుంటున్నారో.. అంటే వారి మనస్సులో భాగస్వామి గురించి ఎలాంటి ఇమేజ్,అంచనాలు ఉన్నాయో ప్రశ్నించుకోవడం చాలా ముఖ్యం. దీని వల్ల వారి ఆలోచనలు మీకు సానుకూలంగా వర్తిస్తాయో లేదో మీకు తెలుస్తుంది.



### ఉమ్మడి కుటుంబం విషయంలో క్లారిటీ

ఈ రోజుల్లో ఉమ్మడి కుటుంబాలు సినిమాల్లో మాత్రమే చూడగలుగుతున్నాం. పెళ్లి అయ్యిందంటే చాలు తల్లిదండ్రుల నుంచి విడిపోయి వేరు కాపురం పెట్టేస్తున్నారు. అయితే కొందరు ఇప్పటికీ ఉమ్మడి కుటుంబాలకే విలువ ఇస్తున్నారు. మీ భాగస్వామిని పెళ్లికి ముందు నీకు ఉమ్మడి కుటుంంలో ఉండటం ఇష్టమా లేక సపరేట్ గా ఉండటం ఇష్టమా అని ఖచ్చితంగా అడగాలి. మీ భాగస్వామిని ఈ ప్రశ్న అడగకుండా ఉంటే పెళ్లి తర్వాత ఉమ్మడి కుటుంబంలో ఉండటం వారికి ఇష్టం లేకుంటే అది పెద్ద గొడవలకు దారి తీసే ఛాన్స్ ఉంటుంది.



### 3 .ఇష్టాలు, అయిష్టాలు ఏంటి..?

వివాహం తర్వాత బట్టల రంగు లేదా సందర్శించడానికి ఇష్టమైన ప్రదేశాల గురించి తెలుసుకోవడానికి ఎల్లప్పుడూ సమయం ఉంటుంది కానీ మీ భాగస్వామి ఫుడ్ సెలక్షన్ గురించి తెలుసుకోవడం మీకు చాలా ముఖ్యం. అంటే వారు శాఖాహారం లేదా మాంసాహార ఆహారాన్ని ఇష్టపడుతున్నాడా లేదా అనేది తెలుసుకోవాలి. దీంతో పాటు మీ భాగస్వామికి స్మోకింగ్ అలవాటు ఉందా లేదా అనేది కూడా అడగండి.ఒకవేళ అలవాటు ఉంటే ఎంత తాగుతాడో అడగండి. ఈ ప్రశ్నలకు సమాధానాలతో మీకు సరైన భాగస్వామిని మీరు ఎంచుకోగలుగుతారు.

### 4 .జాబ్ చేయాలా.. వద్దా..?

ఈ రోజుల్లో, చాలా మంది అమ్మాయిలు ఉద్యోగాలు చేస్తున్నారు కాబట్టి అమ్మాయిలు పెళ్లికి ముందు ఈ ప్రశ్న అడగాలి. వారు తమ కెరీర్ లేదా ప్రస్తుతం వారు చేస్తున్న ఏదైనా ఉద్యోగం చేయాలనుకుంటే వివాహం తర్వాత వారి భాగస్వామి దాని గురించి ఏమనుకుంటారు అని పెళ్లికి ముందే అడగాలి. చాలా సార్లు బాధ్యతలు, భాగస్వామి, కుటుంబం కారణంగా, అమ్మాయిలు తమ కెరీర్‌తో రాజీ పడాల్సి వస్తుంది. ఉద్యోగం మానేసి ఇంట్లోని కుటుంబసభ్యులు, పిల్లలను చూసుకోవాల్సి ఉంటుంది.

# గిబ్లీ ట్రెండును క్యాష్ చేసుకోండి ఇలా..!



గత కొన్ని రోజులుగా సామాజిక మాధ్యమాలను గిబ్లీ ట్రెండ్ ఒక ఊపు ఊపుతోంది. సెలబ్రిటీల నుంచి సాధారణ పౌరుల దాక ప్రతి ఒక్కరూ తమ ఫోటోలను గిబ్లీ ట్రెండ్ రూపంలోకి మార్చి సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారు. ఏ సోషల్ మీడియా ప్లాట్ ఫాం చూసినా గిబ్లీ ఆర్ట్ ట్రెండ్ తెగ వైరల్ అవుతోంది. గిబ్లీ స్టైల్ ఆర్ట్ అనేది.. ఒక ప్రత్యేకమైన ప్రసిద్ధ స్టైల్ ఆర్ట్, యానిమేషన్ శైలిలో ఉంటుంది. అయితే ఈ గిబ్లీ ఆర్ట్ ను జపనీస్ యానిమేషన్ స్టూడియో "స్టూడియో గిబ్లీ" సృష్టించింది. స్టూడియో గిబ్లీ వ్యవస్థాపకులు హయావో మియాజాకి, ఇసావో తకాహతా ఈ స్టైల్ ఆర్ట్ ని సినీ పరిశ్రమకు పరిచయం చేశారు. ఇది ప్రపంచవ్యాప్తంగా చాలా పాపులర్ అయింది. జపనీస్ యానిమేషన్ స్టూడియో "స్టూడియో గిబ్లీ" స్టైల్ లో క్రియేట్ చేసిన ఫొటోలు అందరినీ ఆకర్షిస్తున్నాయి. రాజకీయ నాయకులు, ప్రముఖులు, సామాన్యులు,సెలబ్రిటీలు, పెద్ద పెద్ద రాజకీయనాయకులు తమ ఫొటోలను గిబ్లీ స్టైల్ లోకి మార్చి వాటిని సోషల్ మీడియా ద్వారా షేర్ చేస్తున్నారు. మీరు కూడా ఇప్పటిదాకా సోషల్ మీడియాలో ఇటువంటి ఎన్నో పోస్టులు చూసి ఉండొచ్చు, లైకులు కూడా కొట్టి ఉండొచ్చు. కానీ కేవలం లైక్స్, వ్యూస్ తోనే ఆగిపోయారా? గిబ్లీ ఆర్ట్ ట్రెండ్ కేవలం వినోదం కోసమే కాదు దీని ద్వారా మంచి ఆదాయం కూడా పొందవచ్చు. మీలో కొంచెం క్రియేటివిటీ, డిజిటల్ నైపుణ్యాలు ఉంటే ఈ ట్రెండ్‌తో మీరు డబ్బు కూడా సంపాదించొచ్చని మీకు తెలుసా?


**డబ్బులు సంపాదించే విధానం ఇక్కడ చూద్దాం..!**

ఓపెన్ ఏఐ కంపెనీ.. ఏఐ ఆధారిత ఇమేజ్ జనరేషన్ టూల్ కి కొత్త అప్ డేట్ ప్రకటించింది. దీన్ని ఉచితంగా చాట్ జీపీటీ వినియోగదారులకు అందుబాటులోకి తీసుకువచ్చింది. చాట్ జీపీటీ వాడేవాళ్లందరూ ఉచితంగా సాధారణ టెక్స్ ప్రాంప్ట్ తో అద్భుతమైన స్టూడియో గిబ్లీ స్టైల్ లో మీమ్స్, ఫోటోలను తయారు చేసుకోవచ్చు. చాలా మందికి చాట్‌జీపీటీలో గిబ్లీ స్టైల్ ఆర్ట్ సరిగ్గా రావడం లేదు. అందరూ మంచి ఫోటోలు సృష్టించలేకపోతున్నారు. దీనికి ఒక కారణం అన్ పెయిడ్ వెర్షన్ కావచ్చు. దీంతో ఫోటోలు సరిగ్గా జనరేట్ కాకపోవచ్చు. మీరు చాట్‌జీపీటీ పెయిడ్ వెర్షన్‌ను తీసుకుంటే అద్భుతమైన ఫోటోలను జనరేట్ చేయవచ్చు. వాటిని సోషల్ మీడియాలో స్టోరీస్ లో షేర్ చేసి ప్రమోట్ చేయవచ్చు. దీని పెయిడ్ వెర్షన్ సుమారు రూ.2000 వరకు ఉండవచ్చు. కానీ మీరు దీని ద్వారా వేల రూపాయలు సంపాదించవచ్చు. మీ స్నేహితులు, కుటుంబ సభ్యులకు దీని గురించి చెప్పి ప్రమోట్ చేయవచ్చు. వారికి ఫోటోలు తయారు చేసి ఇవ్వడానికి డబ్బులు వసూలు చేయవచ్చు. ఒక్కో ఫోటోకి మీరు రూ.100 తీసుకున్నా మీకు లాభమే ఉంటుంది.

**సోషల్ మీడియాలో మీ కంటెంట్‌ను ప్రమోట్ చేయండి**


మీరు మీ స్టోరీలో గిబ్లీ స్టైల్ ఫోటోను షేర్ చేసి, మీకు కూడా ఇలాంటి ఫోటో కావాలంటే ఒక్కో ఫోటోకి ఇంత ఛార్జ్ చేస్తాను అని రాయవచ్చు. అంతే మీ స్టోరీకి రిప్లైలు రావడం మొదలవుతాయి. మీరు నాలుగు రోజుల్లో కనీసం 40 ఫోటోలు జనరేట్ చేసినా మీకు రూ.4000 ఆదాయం వస్తుంది.















The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY editor BADHE JAYASHREE.

www.siridaily.com
RNI TG TEL/ 26/A0381

# సిరి

People's Voice వార్తపత్రిక

శనివారం
17-04-2026
సంపుటి (Volume) : 2
సంచిక (Issue) 116

MEDAK, SANGAREDDY, SIDDIPET
పేజీలు : 4


# ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలి

- టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి
- అర్హులైన ప్రతి లబ్ధిదారుకు సంక్షేమ పథకాలు : జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

2



# సర్కారు భూమికి అరబిందో ఎసరు!




## కార్పోరేట్ సంస్థ భూదాహం

(అరబిందో ఆగడాలపై రేపటి సంచికలో మరో కథనం)

- సర్వే నంబర్ 379లో కబ్జా పర్వం
- కోఆపరేటివ్ బ్యాంకు స్థలంలో అక్రమ నిర్మాణాలు
- అడ్డూ అదుపు లేని ఆక్రమణలు
- క్షేత్రస్థాయిలో సాగుతున్న భూ మాఫియా స్కెచ్
- కబ్జా పర్వాన్ని పట్టించుకోని రెవెన్యూ యంత్రాంగం
- కంపెనీ బరితెగింపుపై వెల్లువెత్తుతున్న నిరసనలు
- రైతుల భూమిని కాజేస్తామంటే ఊరుకోం
- అరబిందో తీరుపై మండిపడుతున్న బీజేపీ నేత నాగ ప్రభుగౌడ్

వివరాలు 3లో

కార్పోరేట్ కంపెనీ భూ కబ్జాకు పాల్పడుతుంది. ఏకంగా సర్కార్ భూమినే కబ్జా చేస్తూ అక్రమాలకు పాల్పడుతుంది. ప్రభుత్వ భూమిలో అక్రమ కట్టడాలు సాగిస్తూ తన ఆగడాలను కొనసాగిస్తుంది..సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం బోరపట్ల గ్రామంలో కార్పొరేట్ శక్తులు బరితెగిస్తున్నాయి. అరబిందో ఎపిటోరియా తెరేనియం కంపెనీ ప్రభుత్వ భూమిని తమ సొంత జాగాలా భావిస్తూ కబ్జాకు పాల్పడుతోంది. బోరపట్ల గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 379లో ఉన్న దాదాపు రెండు ఎకరాల విలువైన భూమిని ఈ కంపెనీ అక్రమంగా తన ఆధీనంలోకి తీసుకునేందుకు ప్రయత్నిస్తోంది. ఏమాత్రం సంబంధం లేని ప్రభుత్వ భూమిలోకి చొచ్చుకెళ్లి, అక్కడ ఏకంగా భారీ భవన నిర్మాణానికి సన్నద్ధం కావడం అధికారుల వైఫల్యానికి అద్దం పడుతోంది. (ప్రత్యేక ప్రతినిధి-సిరిన్యూస్)

apitoria
Apitoria Pharma Pvt. Ltd
(A 100% subsidiary of Aurobindo Pharma Limited)



2

## ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి!

పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ రాష్ట్ర అధికారి రవీందర్ నాయక్

## పాఠశాల నిర్మాణం కోసం భూమి కోల్పోతున్నాం

పరిహారం చెల్లించండి.. తహసిల్దార్ కు బాధితుల విన్నపం



2

# కడుపు నొప్పితో వెళ్తే.. కాటికి పంపారు!




## వైద్యుల నిర్లక్ష్యానికి సాఫ్ట్‌వేర్ బలి

## బీరంగూడలోని తిరుమల ఆసుపత్రి నిర్వాకం

- ట్రైనీ డాక్టర్ల ప్రయోగాలు.. మృత్యుపాశంగా వైద్యం
- గంటలోనే గాలిలో కలిసిన ప్రాణం
- ఎనిమిదికి ఆసుపత్రికి.. తొమ్మిదికి జీవచ్ఛవంగా
- అనుభవం లేని డాక్టర్ల చేతిలో రోగుల ప్రాణాలు
- 28 ఏళ్లకే నూరేళ్లు నిండాయా?
- సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని హారిక విషాద మరణం
- కన్నీరుమున్నీరుగా తల్లిదండ్రుల రోదన
- ఆసుపత్రి వద్ద ఉద్రిక్తత.. భారీగా పోలీసుల మోహరింపు

4





చిన్న కుటుంబం...చింతలేని కుటుంబంతో హాయిగా గడుపుతున్న ఆ కుటుంబంలో ప్రాణాలు కాపాడాల్సిన డాక్టర్ల నిర్లక్ష్యం ఆ కుటుంబాన్ని విషాదంలోకి నెట్టింది. కడుపునొప్పి వచ్చిందని ఆసుపత్రికి వెళ్తే ఆపరేషన్ చేయాలని చెప్పి కేవలం గంటలోనే ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని ప్రాణాలను నిలువునా హరించారు. ఈ విషాద ఉదంతం సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ పరిధిలోని బీరంగూడలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే... అమీన్‌పూర్ జీహెచ్ఎంసీ పరిధిలోని బీరంగూడ వందనపురి కాలనీకి చెందిన హారిక (28) ఒక సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తూ తన కుటుంబానికి చేదోడువాదోడుగా ఉండేది. బుధవారం రాత్రి ఆమెకు అకస్మాత్తుగా కడుపునొప్పి రావడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెంది రాత్రి 8 గంటల సమయంలో చికిత్స నిమిత్తం బీరంగూడ లోని మండే మార్కెట్ వద్ద ఉన్న తిరుమల మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ కు తీసుకువెళ్లారు. అప్పటివరకు హారిక ఆరోగ్యంగానే ఉంది. కేవలం కడుపులో అసౌకర్యంగా ఉందనే ఉద్దేశంతోనే ఆమెను ఆసుపత్రికి తీసుకువచ్చారు. అమీన్ పూర్, (సిరి న్యూస్)

# పాఠశాల నిర్మాణం కోసం భూమి కోల్పోతున్నాం

## పరిహారం చెల్లించండి.. తహసిల్దార్ కు బాధితుల విన్నపం

**రామాయంపేట, ఏప్రిల్ 16 (సిరి న్యూస్)** రామాయంపేట మండల కేంద్రంలో నూతనంగా నిర్మించ తలపెట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూల్ కోసం తమ సాగు భూములను సేకరిస్తున్నారని, ప్రభుత్వం తమకు తగిన నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధితుడు జలగడుగుల యాదగిరి స్థానిక తహసీల్దార్ రజని కుమారికి గురువారం వినతి పత్రం సమర్పించారు. రామాయంపేట శివారు లోని సర్వే నంబర్లు 1421/239/2, 1421/239/1 లో ఉన్న సుమారు 2 ఎకరాల భూమిని ప్రభుత్వం పాఠశాల భవన నిర్మాణం కోసం సేకరిస్తోందని, తమకు ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండానే, జీవనాధారమైన ఈ భూములను తీసుకోవడం వల్ల తమ కుటుంబం రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు.




### మహబూబ్ నగర్ తరహాలో పరిహారం ఇవ్వాలి

గతంలో మహబూబ్ నగర్ జిల్లా ముక్తాల్ ప్రాంతంలో ఇదే తరహా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణానికి భూములు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం ఏ విధంగానైతే నష్టపరిహారం అందించిందో, తమకు కూడా అదే రీతిలో పరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు.తమకు న్యాయమైన నష్టపరిహారం అందేలా చూడాలని ఈ సందర్భంగా వారు అధికారులను వేడుకున్నారు.

# ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలి

★ టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి

★ అర్హులైన ప్రతి లబ్దిదారుకు సంక్షేమ పథకాలు : జిల్లా కలెక్టర్ ప్రావీణ్య




**సంగారెడ్డి, ఏప్రిల్ 16 (సిరిన్యూస్):** ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం కంది మండలంలోని రైతు వేదికలో మండల స్థాయి సమావేశం నిర్వహించారు. కార్యక్రమం ప్రారంభంలో రాష్ట్ర గీతాన్ని ఆలపించి, ముఖ్యమంత్రి సందేశాన్ని వినిపించారు. అనంతరం వివిధ శాఖల అధికారులు తమ పరిధిలో అమలవుతున్న సంక్షేమ పథకాల అమలు తీరును వివరించారు. ఈ సందర్భంగా రైతు రుణమాఫీ, రైతు బీమా, ఇందిరమ్మ ఇళ్లు, స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు, కొత్త రేషన్ కార్డులు, పాస్‌బుక్కులు, సన్నబియ్యం పంపిణీ, వైద్య సేవలు తదితర పథకాల లబ్ధిదారుల వివరాలను ప్రజలకు తెలియజేశారు. అలాగే ముఖ్యమంత్రి అల్పాహారం పథకం, ఇందిరమ్మ జీవిత కుటుంబ బీమా, ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం విస్తరణ వంటి నూతన పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక ద్వారా ప్రభుత్వ సంక్షేమ ఫలాలు చివరి కుటుంబానికి చేరేలా అవగాహన కల్పిస్తున్నామన్నారు. జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ మార్చి 6 నుంచి ప్రభుత్వం 99 రోజుల యాక్షన్ ప్లాన్ కింద ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నదన్నారు. ఇప్పటికే శానిటేషన్, ఆరోగ్య కార్యక్రమాలు నిర్వహించామని, ఏప్రిల్ 2న గ్రామ సభలు విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. ఈ వారం రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని, ప్రతి గ్రామంలో పోలీస్ శాఖతో కలిసి రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సర్పంచులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిఐసి జిఎం తుల్జా నాయక్ , ఎంపీడీవో శ్రీనివాస్ , తహసిల్దార్ రవికుమార్ ,ఎంపీఓ మహేందర్ రెడ్డి, సర్పంచులు, ఉప సర్పంచులు, మండల సమాఖ్య ప్రతినిధులు, మహిళలు, రైతులు, మండల ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి!

★ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ రాష్ట్ర అధికారి రవీందర్ నాయక్



**సంగారెడ్డి, ఏప్రిల్ 16(సిరిన్యూస్) :** ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ తెలంగాణ రాష్ట్ర అధికారి డాక్టర్ బి.రవీందర్ నాయక్ వైద్యాధికారులకు సూచించారు. గురువారం ఆయన సంగారెడ్డిలో పీహెచ్‌సీ, ప్రోగ్రాం ఆఫీసర్లతో సమావేశం నిర్వహించారు. అంతకుముందు ఆందోల్ మండలంలోని తాలెల్మ పీహెచ్‌సీ కేంద్రాన్ని సందర్శించి సమావేశం నిర్వహించారు. మందులతో పాటు జాతీయ స్థాయి కార్యక్రమాలను ప్రజలకు అందించాలని సూచించారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ప్రోగ్రాం ఆఫీసర్లతో సమావేశం నిర్వహించి జాతీయ కార్యక్రమాల గురించి రివ్యూ చేపట్టారు. వైద్యాధికారులతో నిత్యం సమావేశాలు నిర్వహించి అన్ని కార్యక్రమాలు ప్రజలు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో ఎం.వసంతరావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సునంద, పీవో ఎంసీహెచ్ నాగనిర్మల, పీవో డీటీటీ శశాంక్, డీటీసీవో అరుణకుమారి, డీఎంవో ప్రవీణ్‌కుమార్, డీఎస్‌వో మనోహర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

# గ్రామ రెవెన్యూ పరిధి దాటి తైబజార్ వసూలు చేయొద్దు

• ఎంపీడీవో కు ఫిర్యాదు చేసిన కాసాల వార్డు సభ్యులు



**హత్నూర, ఏప్రిల్ 16 : (సిరి న్యూస్ )**మండలం లోని దౌల్తాబాద్ గ్రామంలో తైబజార్ కోసం నిర్వహిస్తున్న వేలంపాటలో తైబజార్ దక్కించుకున్న గుత్తేదారు గ్రామ రెవెన్యూ పరిధి దాటి ఎలాంటి ట్యాక్స్ వసూలు చేయకూడదని డిమాండ్ చేస్తూకాసాల గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు గురువారం ఎంపీడీవో, ఎంపీఈఓ లకు వినతి పత్రం అందజేశారు.గత కొన్నేళ్లుగా ఇరు గ్రామాల మధ్య తైబజారు విషయం పెద్ద సమస్యగా మారిందని వారు పేర్కొన్నారు. దౌల్తాబాద్ తైబజార్ ను వేలంపాటలో దక్కించుకున్న గుత్తేదారులు నిబంధనలను అతిక్రమిస్తూ దౌల్తాబాద్ రెవెన్యూ పరిధిని దాటి కాసాల గ్రామ పంచాయతీ పరిధిలో తైబజార్ వసూలు చేస్తున్నారని వారు ఆరోపించారు.ఈ విషయమై పలుమార్లు దౌల్తాబాద్ పంచాయతీ కార్యదర్శికి, పాలక వర్గం దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కావడం లేదంటూ వారు విన్నవించారు. ప్రస్తుతం దౌల్తాబాద్ పంచాయతీ తైబజార్ కాలపరిమితి ముగిసినందున నేడు అనగా తేది 17-04-2026 న తైబజార్ వేలం ఉన్నందున దౌల్తాబాద్ తైబజార్ వేలం పాటలో శివారు పరిధికి సంబంధించి కచ్చితమైన నిబంధనలు అమలయ్యేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు నగేష్,ప్రతాప్,సాగర్, గ్రామస్తులు రాంచందర్,భాస్కర్ ఉన్నారు.

# ఆరంతస్తుల భవనం నేలమట్టం



**అమీన్ పూర్ ఏప్రిల్ 16 సిరి న్యూస్**అమీన్ పూర్ పరిధిలో కబ్జాలకు గురైన భూములను గుర్తించిన హైడ్రాధికారులు గత శనివారం నుండి భారీ కూల్చివేతలు చేపట్టారు.ఆరు రోజుల నుంచి కొనసాగుతున్న కూల్చివేత చర్యలు గురువారం ఆరంతస్తుల భవనం పూర్తిగా నేలమట్టం చేయడం జరిగింది.అనంతరం 861 ఎకరాల ప్రభుత్వ భూమి చుట్టూ ఫెన్సింగ్ నిర్మాణ పనులు జోరుగా కొనసాగుతున్నవి. కబ్జాదా రుల నుండి 15 వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూమి కాపాడిన హైడ్రా అధికారులు. ఈ కూల్చివేత కార్యక్రమంలో హైడ్రా,పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# నాలుగు దశాబ్దాల.. ఆత్మీయ సమ్మేళనం

▪ -నిజాంపేటలో కలిసిన పూర్వ విద్యార్థులు

**రామాయంపేట,(నిజాంపేట) ఏప్రిల్ 15(సిరి న్యూస్):**దాదాపు నాలుగు దశాబ్దాల తర్వాత తమ స్నేహితులు, చదువు చెప్పిన గురువులను చూసి పూర్వ విద్యార్థులు మురిసిపోయారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరేసుకుంటూ సందడిగా గడిపారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1985-86వ సంవత్సరానికి సంబంధించిన 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు నిజాంపేట శ్రీ రేణుక మాత ఫంక్షన్ హాల్ లో ఆత్మీయ సమ్మేళనంలో కార్యక్రమాన్ని నిర్వహించి తమ విద్యాబుద్ధులు నేర్పిన గురువులను శాలువాలతో సత్కరించి వారి ఆశీర్వాదాలను పొందారు. ఈ కార్యక్రమంలో గురువులు జనార్ధన్, మల్లయ్య, బాలయ్య, తిరుమల రావు, పూర్వ విద్యార్థులు కట్ట ప్రభాకర్, మాపురం ప్రభాకర్, పోలు బాలయ్య, మంజీరా సుధాకర్, బ్రహ్మాచారి, నాగాగౌడ్, నాగయ్య, కౌసల్య, పద్మ, వెంకటలక్ష్మి, ప్రేమకల, రామచంద్రం తదితరులు ఉన్నారు.






# సర్కారు భూమికి అరబిందో ఎసరు!

- సర్వే నంబర్ 379లో కబ్జా పర్వం
- కోఆపరేటివ్ బ్యాంకు స్థలంలో అక్రమ నిర్మాణాలు
- అడ్డూ అదుపు లేని ఆక్రమణలు
- క్షేత్రస్థాయిలో సాగుతున్న భూ మాఫియా స్కెచ్
- కబ్జా పర్వాన్ని పట్టించుకోని రెవెన్యూ యంత్రాంగం
- కంపెనీ బరితెగింపుపై వెల్లువెత్తుతున్న నిరసనలు
- రైతుల భూమిని కాజేస్తామంటే ఊరుకోం
- అరబిందో తీరుపై మండిపడుతున్న బీజేపీ నేత నాగ ప్రభుగౌడ్

## కార్పొరేట్ సంస్థ భూదాహం

**( అరబిందో ఆగడాలపై రేపటి సంచికలో మరో కథనం )**





(ప్రత్యేక ప్రతినిధి-సిరిన్యూస్): కార్పొరేట్ కంపెనీ భూ కబ్జాకు పాల్పడుతుంది. ఏకంగా సర్కార్ భూమినే కబ్జా చేస్తూ అక్రమాలకు పాల్పడుతుంది. ప్రభుత్వ భూమిలో అక్రమ కట్టడాలు సాగిస్తూ తన ఆగడాలను కొనసాగిస్తుంది..సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం బోరపట్ల గ్రామంలో కార్పొరేట్ శక్తులు బరితెగిస్తున్నాయి. అరబిందో ఎపిటోరియా తెరేనియం కంపెనీ ప్రభుత్వ భూమిని తమ సొంత జాగాలా భావిస్తూ కబ్జాకు పాల్పడుతోంది. బోరపట్ల గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 379లో ఉన్న దాదాపు రెండు ఎకరాల విలువైన భూమిని ఈ కంపెనీ అక్రమంగా తన ఆధీనంలోకి తీసుకునేందుకు ప్రయత్నిస్తోంది. ఏమాత్రం సంబంధం లేని ప్రభుత్వ భూమిలోకి చొచ్చుకెళ్లి, అక్కడ ఏకంగా భారీ భవన నిర్మాణానికి సన్నద్ధం కావడం అధికారుల వైఫల్యానికి అద్దం పడుతోంది.

### ప్రభుత్వ భూమిపై కన్నేసిన కంపెనీ యాజమాన్యం..

వాస్తవానికి ఈ రెండు ఎకరాల భూమిని ప్రభుత్వం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి కేటాయించింది. రైతులకు సేవలు అందించే సహకార సంఘం కోసం కేటాయించిన ఈ భూమిని రక్షించేందుకు కోఆపరేటివ్ బ్యాంక్ తన సీఎస్ఆర్ నిధుల కింద భూమికి మూడు వైపులా పటిష్టమైన ప్రహరీ గోడను నిర్మించింది. అయితే, పక్కనే ఉన్న అరబిందో తెరేనియం కంపెనీ కన్ను ఈ భూమిపై పడింది. రాత్రికి రాత్రే ఆ గోడను ధ్వంసం చేసి, ప్రభుత్వ స్థలాన్ని తమ ఆవరణలో కలిపేసుకునేలా కుట్రలు చేస్తోంది.

### ప్రహరీ కూల్చివేత.. పిల్లర్లతో భారీ భవనం నిర్మాణం..

కార్పొరేట్ గర్వంతో విర్రవీగుతున్న సదరు కంపెనీ యాజమాన్యం, నిబంధనలకు విరుద్ధంగా సహకార సంఘం సరిహద్దు గోడను కూల్చివేసింది. అంతటితో ఆగకుండా, ఆక్రమించుకున్న ప్రభుత్వ భూమిలో దాదాపు 10 భారీ పిల్లర్లను వేసి భవన నిర్మాణ పనులను వేగవంతం చేసింది. ప్రభుత్వ రికార్డుల్లో ఒకలా ఉంటే, క్షేత్రస్థాయిలో అరబిందో కంపెనీ మరొకలా వ్యవహరిస్తోంది. సహకార సంఘం అధికారుల కళ్లు గప్పి, విలువైన భూమిని కాజేసేందుకు కంపెనీ వేసిన స్కెచ్ ఇప్పుడు మండలంలో చర్చనీయాంశంగా మారింది.

### కళ్ళప్పగించి చూస్తున్న రెవెన్యూ అధికారులు..

ఇంత భారీ స్థాయిలో ఆక్రమణ జరుగుతున్నా, పక్కనే గోడను కూల్చి పిల్లర్లు వేస్తున్నా మండల స్థాయి అధికారులు మిన్నకుండిపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కార్పొరేట్ కంపెనీ ఇస్తున్న ఒత్తిళ్లకు తలొగ్గారా? లేక ముడుపుల మత్తులో జోగుతున్నారా? అని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ భూమిని కాపాడాల్సిన రెవెన్యూ మరియు సహకార శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం అరబిందో కంపెనీకి వరంగా మారింది.

### బీజేపీ నేత నాగప్రభు గౌడ్ ధ్వజం..

అరబిందో తెరేనియం కంపెనీ సాగిస్తున్న ఈ అక్రమాలను హత్నూర బీజేపీ మండల అధ్యక్షుడు నాగప్రభు గౌడ్ తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వ భూమిని కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేస్తుంటే అధికారులు ఏం చేస్తున్నారని ఆయన నిలదీశారు. సహకార సంఘం భూమిలో అక్రమంగా వేసిన పిల్లర్లను వెంటనే తొలగించాలని, కూల్చిన గోడను కంపెనీ ఖర్చుతోనే తిరిగి నిర్మించాలని డిమాండ్ చేశారు. రైతుల ప్రయోజనాల కోసం కేటాయించిన భూమిని ఆక్రమిస్తే ఊరుకునే ప్రసక్తే లేదని, దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

### ప్రభుత్వ భూమిని వెంటనే స్వాధీనం చేసుకోవాలి...

బోరపట్ల గ్రామ పరిసరాల్లో కంపెనీలు సాగిస్తున్న భూ అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలని స్థానికులు కోరుతున్నారు. అరబిందో తెరేనియం కంపెనీ పెట్టిన పిల్లర్లను కూల్చివేసి, సర్వే నంబర్ 379లో ఉన్న ప్రభుత్వ భూమిని వెంటనే స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం ఇలాగే కొనసాగితే, భవిష్యత్తులో మిగిలిన ప్రభుత్వ భూములు కూడా కార్పొరేట్ కంపెనీల పాలయ్యే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.





# కడుపు నొప్పితో వెళ్తే.. కాటికి పంపారు!

### వైద్యుల నిర్లక్ష్యానికి సాఫ్ట్‌వేర్ బలి

## బీరంగూడలోని తిరుమల ఆసుపత్రి నిర్వాకం





- ట్రైనీ డాక్టర్ల ప్రయోగాలు.. మృత్యుపాశంగా వైద్యం
- గంటలోనే గాలిలో కలిసిన ప్రాణం
- ఎనిమిదికి ఆసుపత్రికి.. తొమ్మిదికి జీవచ్ఛవంగా
- అనుభవం లేని డాక్టర్ల చేతిలో రోగుల ప్రాణాలు
- 28 ఏళ్లకే నూరేళ్లు నిండాయా?
- సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని హారిక విషాద మరణం
- కన్నీరుమున్నీరుగా తల్లిదండ్రుల రోదన
- ఆసుపత్రి వద్ద ఉద్రిక్తత.. భారీగా పోలీసుల మోహరింపు



**అమీన్ పూర్, ఏప్రిల్ 16 (సిరి న్యూస్):** చిన్న కుటుంబం...చింతలేని కుటుంబంతో హాయిగా గడుపుతున్న ఆ కుటుంబంలో ప్రాణాలు కాపాడాల్సిన డాక్టర్ల నిర్లక్ష్యం ఆ కుటుంబాన్ని విషాదంలోకి నెట్టింది. కడుపునొప్పి వచ్చిందని ఆసుపత్రికి వెళ్తే ఆపరేషన్ చేయాలని చెప్పి కేవలం గంటలోనే ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని ప్రాణాలను నిలువునా హరించారు. ఈ విషాద ఉదంతం సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ పరిధిలోని బీరంగూడలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే... అమీన్‌పూర్ జీహెచ్‌ఎంసీ పరిధిలోని బీరంగూడ వందనపురి కాలనీకి చెందిన హారిక (28) ఒక సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తూ తన కుటుంబానికి చేదోడువాదోడుగా ఉండేది. బుధవారం రాత్రి ఆమెకు అకస్మాత్తుగా కడుపునొప్పి రావడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెంది రాత్రి 8 గంటల సమయంలో చికిత్స నిమిత్తం బీరంగూడలోని మండే మార్కెట్ వద్ద ఉన్న తిరుమల మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ కు తీసుకువెళ్లారు. అప్పటివరకు హారిక ఆరోగ్యంగానే ఉంది. కేవలం కడుపులో అసౌకర్యంగా ఉందనే ఉద్దేశంతోనే ఆమెను ఆసుపత్రికి తీసుకువచ్చారు.

### గంటలోనే విగతాజీవిగా..

ఆసుపత్రిలో చేరిన హారికను పరీక్షించిన అక్కడి వైద్యులు, పరిస్థితి విషమంగా ఉందని, వెంటనే ఆపరేషన్ చేయాలని కుటుంబ సభ్యులకు చెప్పారు. వైద్యులు చెప్పిన మాటలను నమ్మి వారు ఆపరేషన్‌కు సమ్మతించారు. అయితే ఆసుపత్రిలో చేరిన కేవలం గంట వ్యవధిలోనే అంటే రాత్రి 9 గంటల సమయంలో హారిక మరణించినట్లు వైద్యులు ప్రకటించడంతో కుటుంబ సభ్యులు ఒక్కసారిగా దిగ్భ్రాంతికి గురయ్యారు.




ఎనిమిది గంటలకు తమతో పాటు నడిచి వచ్చిన బిడ్డ గంటలోనే శవమై కనిపించడాన్ని వారు తట్టుకోలేకపోయారు.

### వైద్యుల నిర్లక్ష్యంపై బంధువుల ఆగ్రహం...

హారిక మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బంధువులు ఆరోపిస్తున్నారు. ఆ సమయంలో ఆసుపత్రిలో నైపుణ్యం కలిగిన సీనియర్ డాక్టర్లు అందుబాటులో లేరని, కేవలం ట్రైనీ డాక్టర్లే హారికపై ప్రయోగాలు చేశారని వారు మండిపడుతున్నారు. కడుపు నొప్పికి ఇచ్చిన ఇంజక్షన్ వికటించిందా? లేక అనస్థీషియా డోస్ ఎక్కువైందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆపరేషన్ థియేటర్‌లో అసలేం జరిగింది?



ఆసుపత్రి మార్చురీకి తరలించారు. పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాత మరణానికి గల అసలు కారణాలు తెలుస్తాయని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హామీ ఇచ్చారు.

### తల్లిదండ్రుల గుండెకోత..

'మేమే మా బిడ్డను నడిపించుకుంటూ తీసుకువచ్చాము.. లోపలికి తీసుకెళ్లిన కొద్దిసేపటికే ప్రాణం పోయిందని ఎలా చెబుతారు?' అంటూ తల్లిదండ్రులు గుండెలు బాదుకుంటూ రోధించడం అక్కడ ఉన్న వారందరినీ కలచివేసింది. ఆరోగ్యంగా ఉన్న తమ బిడ్డను ఆపరేషన్ పేరుతో పొట్టన పెట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో ఆశలు పెట్టుకున్న తమ కూతురు ఇలా కళ్ళ ముందే విగతాజీవిగా మారడాన్ని వారు భరించలేకపోతున్నారు. కాగా ఇప్పటివరకు హాస్పటల్ ను డిఎంహెచ్ఓ కానీ, ఉన్నత అధికారులు విజిట్ చేయకపోవడం గమనార్హం. ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించి ప్రాణాలు తీస్తున్న ఆస్పత్రిని సీజ్ చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

### ఆక్రందనలతో మిన్నంటిన బీరంగూడ..

తమ బిడ్డ ప్రాణాలు పోయాయని తెలియగానే బంధువులు, స్నేహితులు పెద్ద ఎత్తున ఆసుపత్రికి చేరుకొని ధర్నాకు దిగారు. తిరుమల ఆసుపత్రిని ముట్టడించిన బంధువులు సరైన పరికరాలు లేకపోయినా, అనుభవం లేని డాక్టర్లతో వైద్యం అందించడం వల్లనే ఈ అనర్థం జరిగిందని నినదించారు. ఎంతో భవిష్యత్తు ఉన్న యువతిని పొట్టన పెట్టుకున్నారని, యాజమాన్యం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రి వద్ద భారీగా గుమిగూడిన జనాన్ని నియంత్రించడం పోలీసులకు కష్టతరమైంది.





